www.vishalabharati.com
epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్
29.06.2024
సంపుటి:2 సంచిక:256

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక



## టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు రిలీజ్

- 73.03 శాతం ఉత్తీర్ణత.. బాలురు 71.01, బాలికలు 76.37 శాతం

..మిగతా 2 లో



### రుణమాఫీకి రేషన్ కార్డు

# ప్రమాణికం కాదు

### నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు

- రుణమాఫీ తర్వాత రైతు భరోసాపై దృష్టి
- రాష్ట్ర బడ్జెట్ వాస్తవ అంచనాలను ప్రతిబింబించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రుణమాఫీకి రేషన్ కార్డు ప్రమాణికం కాదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మరో నాలుగు రోజుల్లో రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేస్తామని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్ విషయంలోనూ రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. బడ్జెట్ వాస్తవాలను ప్రతిబింబించేలా ఉండాలని సూచించారు. పాస్ బుక్ ఆధారంగానే రుణ మాఫీ ఉంటుందని తెలిపారు. రూ.2లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్న సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీ తర్వాత రైతు బంధు ఇతర పథకాలపై దృష్టి పెడతామని వెల్లడించారు. పంట రుణాలు మాత్రమే మాఫీ అవుతాయి తప్ప.. ..బంగారంపై తీసుకున్న రుణాల మాఫీ కాదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత లేదని.. పంపిణీలో మాత్రమే అంతరాయాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తాము అధికారం లోకి వచ్చేసరికి ప్రతి ఏడాది జరిగే నిర్వహణ

..మిగతా 2 లో





# ప్రజలు బోల్తాపడ్డరు

## అందుకే మనల్ని ఓడించారు

- మన ఎమ్మెల్యేలు కొంతమంది దొంగల్లో కలుస్తున్నారు
- వాళ్లు పోయినా బాధ లేదు
- తెలంగాణ ఆత్మను అర్థం చేసుకోవడం బీఆర్ఎస్ కే సాధ్యం
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

సమైక్యవాదులతో కలబడి నిలబడి అత్యంత కష్టతరమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఒక లెక్కనే కాదని, పార్టీ నుంచి పోయి దొంగలల్ల కలుస్తున్న నాయకుల గురించి ఏమాత్రం ఆలోచించవలసిన అవసరం లేదని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. ఒకరు పోతే పది మంది నాయకులను పార్టీ తీర్చిదిద్దుకుంటుందని పునరుద్ఘాటించారు. ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో పార్టీ కార్యకర్తల సమావేశం శుక్రవారం కూడా కొనసాగింది. కోరుట్ల జగిత్యాల నియోజక వర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలి వున్నయని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, కలలను నెరవేర్చగలిగే అవగాహన మనకు మాత్రమే ఉన్నదని అన్నారు. తెలంగాణ ఆత్మను అర్థం

..మిగతా 2 లో



### బీఆర్ఎస్‌కు

# మరో షాక్

- పార్టీని వీడిన ఎమ్మెల్యే కాలె యాదయ్య
- రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ గూటికి
- త్వరలో మరికొందరు కూడా..

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**బీఆర్ఎస్‌కు మరో పెద్ద షాక్ తగిలింది. గులాబీ పార్టీలోని ఒక్కొక్కరు పార్టీ ఫిరాయిస్తున్నారు. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా కాంగ్రెస్‌లోకి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్

..మిగతా 2 లో

# షాద్ నగర్‌లో భారీ అగ్ని ప్రమాదం



**ఆరుగురు దుర్మరణం | 30 మందికి గాయాలు | ఫ్యాక్టరీలో గ్యాస్ కంప్రెష్ చేస్తుండగా పేలుడు**

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్‌లో శుక్రవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. బూర్గుల గ్రామ శివారులోని స్థానిక సౌత్ గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ప్రమాదవశాత్తు కంప్రెషర్ పేలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షెడ్ కుప్పకూలింది. ఫ్యాక్టరీలో గ్యాస్ కంప్రెష్ చేస్తుండగా పేలుడు సంభవించినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి మృతదేహాలు ఛిద్రమయ్యాయి. మరికొంత మందికి తీవ్ర గాయాలయ్యాయి. దాదాపు 30 మందికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రమాద సమయంలో 150 మందికి పైగా కార్మికులు అక్కడ ఉన్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మంటలు అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



### రానున్న ఎన్నికల్లో

# మూడు రాష్ట్రాలు మనవే

- అందరూ ఐక్యంగా పోరాడాలి
- పార్టీ శ్రేణులకు రాహుల్ దిశానిర్దేశం

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:** త్వరలో జరగబోయే మూడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభ ఎన్నికల్లో విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ముందుకు సాగాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నేతలకు దిశా నిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ గెలుపు కోసం ఐక్యంగా పని చేయాలని సూచించారని చెప్పాయి. త్వరలో మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్ రాష్ట్రాలతో పాటు జమ్ముకశ్మీర్ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని, మిత్ర పక్షాలతో కలిసి ఎన్నికల్లో పని చేయాలని రాహుల్‌గాంధీ, హస్తం పార్టీ నేతలకు సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఇటీవల సమీక్షించారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో హస్తం



పార్టీలో సీనియర్ నేతల మధ్య నెలకొన్న అంతర్గత పోరు విషయమై రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది



# ఇక ప్రజా సేవలోనే

- జైలు నుంచి విడుదలైన హేమంత్ సోరెన్
- ఐదు నెలల తర్వాత బయటికి
- తప్పు లేకపోయినా బలవంతంగా జైల్లో పెట్టారు
- ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్

..మిగతా 2 లో

### వచ్చేవారం జాతీయ రహదారుల

# హైలెవల్ కమిటీ రాష్ట్ర పర్యటన



- అన్ని అంశాలతో అధికార యంత్రంగం సిద్ధంగా ఉండాలి
- జాతీయరహదారి విస్తరణ పనులపై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష
- వెంటనే పనులు ప్రారంభించండి.. ఎక్కడ అలసత్వం వద్దు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఎల్బీనగర్ మల్కాపూర్ జాతీయరహదారి విస్తరణ పనులపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. రహదారి విస్తరణ పనులకి అడ్డుగా ఉన్న వాటర్ లేన్, ట్రాన్స్ కో సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడానని ఆయన తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించాలని, ఎక్కడ అలసత్వం ఉండొద్దు అని అధికారులకి సూచించారు. న్యాక్లో జాతీయ రహదారులపై రోడ్లు, భవనాల శాఖ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు వచ్చే వారంలో జాతీయ రహదారుల హైలెవల్ కమిటీ రాష్ట్రానికి వస్తుందని, అన్ని అంశాలతో అధికార యంత్రంగం సిద్ధంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ అధికారులకి

..మిగతా 2 లో



### అంబేద్కర్ వర్సిటీ ఇన్‌చార్జీ రిజిస్ట్రార్‌గా సుధారాణి

## బాధ్యతల స్వీకరణ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**అంబేద్కర్ వర్సిటీ ఇన్ చార్జ్జీ రిజిస్ట్రార్ గా ప్రొఫెసర్ సుధా రాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీలో చరిత్ర విభాగ సీనియర్ ప్రొఫెసర్, డైరెక్టర్‌గా ఆమె బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రొఫెసర్ ఏవీఎన్ రెడ్డి ఈ నెలాఖరున ఉద్యోగ పదవీ విరమణ చేయనున్నారు. ఇన్ చార్జ్జీ రిజిస్ట్రార్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు.



# రుణమాఫీకి రేషన్ కార్డు ప్రమాణికం కాదు

**మొదటిపేజీ తరువాయి**

పనులు జరగడం వల్లే అంతరాయం ఏర్పడిందని చెప్పారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు రోజుల్లో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ఉంటాయని తెలిపారు. తెలంగాణ బడ్జెట్ వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు చెప్పానని అన్నారు. అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలకు మించి బడ్జెట్ ఉండకూడదని అధికారులకు అదేశాలిచ్చానన్నారు. మండలాలు, రెవెన్యూ డివిజన్ విషయంలో కమిషన్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో చర్చించి బడ్జెట్ సమావేశాల తర్వాత కమిషన్ నియమిస్తామన్నారు. బీసీ కమిషన్ పదవీకాలం ఆగస్టుతో పూర్తవుతుందని.. కొత్త వారిని నియమించిన తర్వాత కుల గణన చేస్తామని చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి సారించామని తెలిపారు.

# ప్రజలు బోల్తాపడ్డరు

**మొదటిపేజీ తరువాయి**

చేసుకుంటూ సమస్యల లోతును పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా ఉద్యమాన్ని నడిపించి రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ కు మాత్రమే ఉన్నదని కేసీఆర్ వివరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. "మనం రెట్టించిన ఉత్సాహంతో భవిష్యత్తులో ఇంకా బాగా ప్రజలకోసం పనిచేయాల్సి వుంది. ప్రజలు అవకాశమిస్తే..గత పదేండ్లు చిత్తశుద్ధితో రాజీపడకుండా ఉద్యమ ఆకాంక్షల సాధనదిశగా లక్ష్యం ప్రకారం పనిచేసి ప్రగతిని సాధించి ప్రజల మన్ననలను పొందినం.కుల మతాలకతీతంగా పని చేస్తూ వ్యవసాయం,సాగునీరు,విద్యుత్తు వంటి అనేక మౌలిక వ్యవస్థలను మెరుగుపరుస్తూ అనేక ప్రజా సమస్యలకు పరిష్కారం చూపినం. కుల వృత్తులను అభివృద్ధి చేసి గ్రామ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసినం. అయితే... అయితే కొన్ని కొన్ని సార్లు ప్రజాస్వామ్యంలో అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు బోల్తపడుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో అదే జరిగింది.అంతమాత్రాన నిరుత్సాహపడొద్దు. అధికారం ఉంటేనే పనిచేస్తామంటే పద్ధతికాదు. మనం ఏ హోదాలోవున్న కానీ ప్రజలకోసం పనోచేయాల్సిందే. అంతిమ లక్ష్యం తెలంగాణ ప్రజల సంక్షేమం అభివృద్ధి మాత్రమే. ఇంకా నెరవేరాల్సిన ప్రజల కలలను మనం మాత్రమే నెరవేరుస్తాం. ఆనాడు మనం ఉద్యమంలకు దిగినప్పుడు మనతో ఎవరున్నారు.?నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకునేది పార్టీనే. మొన్న జగిత్యాల నుంచి ఒకాయన పోయి దొంగలల్ల కలిసిండు. బాధ పడేదేమీలేదు. ఆయనను తయారుచేసింది పార్టీనే. అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారు చేసుకుంటది." అని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డా సంజయ్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బాల్క సుమన్, జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ, జగిత్యాల జెడ్పీ చైర్మన్ వసంత సురేష్, పెద్దపెల్లి టీఆర్ఎస్ నేత ఉష తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం పై చర్చించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్రెడ్డి, జీవన్ రెడ్డి, గంప గోవర్ధన్, జాజల సురేందర్, హన్మంత్ షిండే తదితరులు పాల్గొన్నారు.



# టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు రిలీజ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను అధికారులు శుక్రవారం రిలీజ్ చేశారు. కాగా ఈ పరీక్షలో మొత్తం 73.03 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 71.01 శాతం బాలురు, 76.37 శాతం బాలికలున్నారు. బాలుర కంటే బాలికలు 5.36 శాతం విద్యార్థులు అధికంగా పాసయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా నిర్మల్ జిల్లా టాప్ లో ఉంది. వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. కాగా వికారాబాద్ జిల్లా చివరి స్థానంలో ఉంది. కేవలం 42.14 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. టెన్త్ ఫలితాలను ఈనెల 3 నుంచి 13 వరకు నిర్వహించారు. మొత్తం 51,272 మంది రిజిస్టర్ చేసుకోగా 46,731 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. అందులో 34,126 మంది ఉత్తీర్ణత సాధించారు.

**రీకౌంటింగ్ కు వచ్చేనెల 8 వరకు గడువు**

రీకౌంటింగ్ కోసం విద్యార్థులు సబ్జెక్టుకు రూ.500 చొప్పున ఎస్‌బీఐ బ్యాంకు చలాన్ ద్వారా చెల్లించాలని అధికారులు స్పష్టంచేశారు. రీకౌంటింగ్ కు వచ్చేనెల 8వ తేదీ వరకు గడువు విధించారు. డీడీల ద్వారా ఫీజు చెల్లింపును అంగీకరించబోమని స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా రీవెరిఫికేషన్, జవాబు పత్రాల జిరాక్స్ కాపీ పొందేందుకు రూ.1000 చలాన్ ద్వారా చెల్లించాలని స్పష్టంచేశారు. కాగా దీనికి అభ్యర్థి సంబంధిత పాఠశాలలో హాల్ టికెట్ జిరాక్స్ కాపీ, కంప్యూటరైజ్డ్ మెమోతో రివెరిఫికేషన్ కు దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయులు దాన్ని www.bse.telangana.gov.in వెబ్ సైట్ ద్వారా అప్ లోడ్ చేస్తారని పేర్కొన్నారు.

# బోనాలలో విద్యుత్ ఏర్పాట్లపై ఎస్పీడీసీఎల్ సీఎండీ సమీక్ష

- వచ్చేనెల 2లోపు పనులు పూర్తిచేయాలని ఆదేశం
- ప్రతి ఆలయానికో నోడల్ ఆఫీసర్
- సిబ్బంది అలర్ట్ గా ఉండాలని ఆదేశం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మహానగరంలో వచ్చేనెల 7 నుంచి ఆగస్టు 3 వరకు బోనాలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో బోనాల కోసం విద్యుత్ ఏర్పాట్లపై ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ శుక్రవారం హైదరాబాద్ లో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. బోనాలు వచ్చే నెల 7 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో 2వ తేదీలోపే విద్యుత్ సంబంధిత ఏర్పాట్లన్నీ పూర్తిచేయాలని ఆదేశించారు. చీఫ్ ఇంజినీర్, ఎస్ఈలు ఆలయాలను విజిట్ చేసి నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి ఆలయానికి ఒక నోడల్ ఆఫీసర్ గా ఏఈని కేటాయించాలని స్పష్టంచేశారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఆర్ అండ్ బీ అధికారులు, ఆలయాల కమిటీలతో సైతం సమన్వయం చేసుకోవాలని సూచించారు. డీటీఆర్లపై లోడ్ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సిబ్బంది నిత్యం అలర్ట్ గా ఉండాలని తెలిపారు. ఈ సమీక్షలో ఇన్ చార్జీ డైరెక్టర్లు నందకుమార్, నర్సింహులు, చీఫ్ ఇంజినీర్లు సాయిబాబు, పాండ్య, శివాజీ, భిక్షపతి, ఆనంద్, సీజీఎం కృష్ణా రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజినీర్లు తదితరులు ఉన్నారు.

## వచ్చేవారం జాతీయ రహదారుల

# హైలెవల్ కమిటీ రాష్ట్ర పర్యటన



**మొదటిపేజీ తరువాయి**

సూచించారు. మన్నెగూడ రహదారికి మార్గం సుగమం చేసేందుకు, ఎన్జీటీ ఆదేశానుసారం 915 చెట్లను రీలొకేట్ చెయ్యాలని ఆయన అధికారులకు సూచించారు.కాంట్రాక్టు సంస్థ 300 చెట్లను రీలొకేట్ చేసేందుకు సిద్ధంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. మిగతా 615 చెట్లను అటవీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారుల అధికారులు రీలొకేట్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి రజాక్ను ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్, ఎన్హెచ్ 65, మన్నెగూడ, ఆర్మూర్‌మంచిర్యాల జాతీయ రహదారులపై మంత్రి కోమట్ రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష చేశారు. ప్రజల ప్రాణాలు పోతుంటే నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు స్పష్టం చేశారు. వేగంగా పనులు పూర్తిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు.

# పీవీ బహుభాషాకోవిదుడు

- ఆర్థిక సంస్కరణలకు బీజం వేసిన నేత
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- జయంతి సందర్భంగా ఘన నివాళి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

స్థిత ప్రజ్ఞుడు,బహుభాషాకోవిదుడు, నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి పూర్వ ప్రధానమంత్రి భారతరత్న పీ.వీ. నరసింహా రావు జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు,భవనాలు మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వారికి నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. తెలుగు జాతి వెలుగు - నిండైన తెలుగుదనానికి నిలువెత్తు రూపం పీవీ నరసింహారావు అని కొనియాడారు. దేశ భవిష్యత్తు కోసం దూరదృష్టి కలిగిన నిర్ణయాలు తీసుకున్న రాజకీయ మేధావి అంటూ శ్లాఘించారు. దేశంలో ఆర్థిక సంస్కరణలకు బీజం వేసిన నేత అని పేర్కొన్నారు. సంకీర్ణ రాజకీయాలను సమర్థంగా



నడిపించి దేశానికి కొత్త మార్గం చూపించిన రాజనీతిజ్ఞుడు పీ.వీ అని ప్రశంసించారు. ఈ రోజు దేశంలో మనం ఐదు ట్రిలియన్ల ఆర్థికాభివృద్ధి గురించి మాట్లాడుతున్నామంటే... అది కేవలం పీ.వీ. ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల మూలంగానే



సాధ్యమయ్యిందన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధిబాట పట్టించవచ్చని.. త్రికరణశుద్ధిగా నమ్మిన నాయకుడు పీ.వీ. నరసింహారావు గారు. తెలుగు జాతి ఉన్నంత వరకు పీ.వీ. నరసింహారావు కీర్తి ఉంటుందని చెప్పారు.



# ఇక ప్రజా సేవలోనే

- జైలు నుంచి విడుదలైన హేమంత్ సోరెన్
- ఐదు నెలల తర్వాత బయటికి
- అండగా నిలిచిన పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు
- తప్ప లేకపోయినా బలవంతంగా జైల్లో పెట్టారు
- ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**



ఝార్ఖండ్ ప్రజలకు తాము ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అన్ని చర్యలు తీసుకుంటామని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తెలిపారు. ఐదు నెలల తర్వాత తాను చట్టబద్ధంగా జైలు నుంచి బయటకు వచ్చానని వ్యాఖ్యానించారు. జైలులో ఉన్నప్పుడు అండగా నిలిచిన పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. భూకుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో హైకోర్టు బెయిల్ మంజూరు చేయడం వల్ల శుక్రవారం సాయంత్రం జైలు నుంచి విడుదలయ్యారు.హేమంత్ జైలు నుంచి బయటకు రాగానే పెద్ద సంఖ్యలో జేఎంఎం మద్దతుదారులు అనుకూలంగా నినాదాలు చేశారు. న్యాయవ్యవస్థతోపాటు మద్దతు తెలిపిన ప్రజలకు హేమంత్ భార్య కల్పన ధన్యవాదాలు తెలిపారు. తాను ఎందుకు జైలుకు వెళ్లానో దేశం మొత్తానికి తెలుసన్న హేమంత్, 5 నెలలుగా ఝార్ఖండ్‌లో పరిస్థితులు ఆందోళనకరంగానే ఉన్నాయని వ్యాఖ్యానించారు. తన తప్పు లేకపోయినా బలవంతంగా జైల్లో పెట్టారని ఆరోపించారు.



# బీఆర్ఎస్‌కు మరో షాక్

**మొదటిపేజీ తరువాయి**

కండువా కప్పుకున్నారు. రేవంత్ రెడ్డి కూడా కండువా కప్పి కాలె యాదయ్యను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో మరికొన్ని చేరికలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే.కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీతోనే రాజకీయ జీవితం ప్రారంభించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ పని చేసి 2009లో తొలిసారి చేవెళ్ల నుంచి పోటీచేసి ఓటమి చెందారు. 2014 ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరి.. ఎమ్మెల్యేగా మొదటిసారి గెలిచారు. మళ్లీ 2018, 2023 ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ తరపున పోటీ చేసి వరుసగా గెలుపొదారు. అలా కాలె యాదయ్య 2023 ఎన్నికల్లో గెలిచాక ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు.

# టెండర్ లేకుండా కోట్ల కాంట్రాక్టు ఎలా ఇచ్చారు

- ఆర్టీసీ టిక్కెటింగ్ మెషీన్ల కాంట్రాక్ట్ పై వివరణ ఇవ్వలేం..
- క్రిశాంక్ వేసిన ఆర్టీఐకి ఆర్టీసీ ఎండీ రిప్లై



టీఎస్ ఆర్టీసీ టిక్కెటింగ్ మెషీన్ల కాంట్రాక్ట్‌పై తాము వివరణ ఇవ్వలేం.. అది మా పరిధిలో లేదంటూ బీఆర్ఎస్ నేత క్రిశాంక్ వేసిన ఆర్టీఐకి ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ రిప్లై ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో మన్నె క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ విషయాన్ని వెల్లడించారు.రెండు సంవత్సరాల నుంచి రద్దు చేస్తూ వచ్చిన కాంట్రాక్టు మూడు రోజుల్లో ఎలా ఇచ్చారు..? అని క్రిశాంక్ ప్రశ్నించారు. టెండర్ లేకుండా కోట్ల రూపాయల కాంట్రాక్టు ఎలా ఇచ్చారు? అని నిలదీశారు. మూడు రోజుల్లో ఆర్టీసీ డెలిగేషన్ దేశం మొత్తం వెళ్లి స్టడీ చేసిందా? అని అడిగారు. ఏయే రాష్ట్రాలకు వెళ్లారు. ఏ అధికారులను కలిశారు. వాళ్ళు ఏం డీటెయిల్స్ ఇచ్చారు అని ఆర్టీఐ ద్వారా సమాచారం కోరితే ఆర్టీసీ అధికారుల సింపుల్ గా ఆర్టీసీ టిక్కెటింగ్ మెషీన్ల కాంట్రాక్టు పై మేం వివరణ ఇవ్వలేము, అది మా పరిధిలో లేదు అన్నారని క్రిశాంక్ తెలిపారు.రాష్ట్రంలో అధికారులను ఏదైనా సమాచారం అడిగితే మాకు తెలియదు, అది మా పరిధిలో లేదు అంటున్నారు... మంత్రులను ఏదైనా అడిగితే వాళ్ళు కూడా మాకు తెలియదు అంటూన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న మంత్రులు.. కేవలం డమ్మీలుగా ఉన్నారా..? వారి నిర్ణయాలు డమ్మీగా ఉన్నాయా..? అధికారులు మంత్రులకు చెప్పడం లేదా..? లేదా తప్పించుకునేందుకు మంత్రులే సాకులు చెబుతున్నారా..? అసలు సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నాడని మన్నె క్రిశాంక్ నిలదీశారు.




# ఈ ఏడాది ఘనంగా 'వన మహోత్సవం

**- 20.02 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం**

**విశాలభారతి,హైదరాబాద్:**

వన మహోత్సవం' కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 20.02 కోట్ల మొక్కలు నాటనున్నారు. ఈ మేరకు గురువారం జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పురపాలక శాఖ పరిధిలో 10.09 కోట్ల మొక్కలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 6.37 కోట్లు, అటవీ శాఖ పరిధిలో 1.34 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించింది.2015 నుంచి గతేడాది వరకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 'తెలంగాణకు హరితహారం' పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించిన సంగతి విధితమే. ప్రస్తుత రేవంత్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరుతో నిర్వహించాలని నిర్ణయించి లోగోను ఖరారు చేసింది.

# 5 లక్షల మొక్కలు నాటాలి

- ప్రతి బూత్ లో 10 మొక్కలు
- ఈనెల 30 వరకు పంపిణీ
- జిల్లాల్లో యువ, ఓబీసీ, కిసాన్ మోర్చాలకు బాధ్యత
- బీజేపీ నేత ఎండల లక్ష్మీనారాయణ

**విశాలభారతి,హైదరాబాద్:**



శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నుంచి జయంతి వరకు దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను బీజేపీ చేపడుతోంది. అందులోభాగంగా తెలంగాణలో 5 లక్షల మొక్కలను నాటాలని నిర్దేశించుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల లక్ష్మీనారాయణ తెలిపారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణహితం కోసం మొక్కలు నాటాలని శ్రేణులకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. దేశ సమగ్రత కోసం శ్యామప్రసాద్ ముఖర్జీ చేసిన బలిదానాన్ని ప్రతి జిల్లా కేంద్రంలో ప్రజలకు వివరించి మొక్కలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 30 తేదీ వరకు మొక్కలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి బూత్ లో పది మొక్కలు నాటాలని సంకల్పించినట్లు చెప్పారు. జిల్లాలవారీగా మొక్కలను యువ మోర్చా, ఓబీసీ మోర్చా, కిసాన్ మోర్చా నేతలు అందజేస్తారని తెలిపారు.



# ఎట్టకేలకు నేడు కౌన్సిల్ సమావేశం

- ఆరు నెలల తర్వాత కౌన్సిల్ సమావేశానికి మోక్షం
- కౌన్సిల్ సమావేశంలో రసభసగ సాగనున్న చర్చ..

**వనపర్తి, విశాల భారతి:** మున్సిపాలిటీ పాలనలో అస్తవ్యస్తంగా తయారైందన్న ఆరోపణలకు గడిచిన ఆరు నెలలుగా కౌన్సిల్ సమావేశం లేకుండా నిరీక్షణ తప్పలేదనే చెప్పాలి. ఎట్టకేలకు కౌన్సిల్ సమావేశము ఏర్పాటు చేయాలని అట్టహాసంగా నేటి సమావేశానికి సంసిద్ధమయింది. గడిచిన వేసవికాలం నుంచి మొదలైన వర్షాకాలంలోనైనా పట్టణంలో ఉన్న 33 వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేసేందుకు కౌన్సిలర్లు మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత జనవరిలో బడ్జెట్ సమావేశం తప్ప పట్టణ అభివృద్ధి పైన, ప్రజా సమస్యల పైన ఆరు నెలల పాటు కౌన్సిల్ సాధారణ సమావేశాలు నిర్వహించాలన్న ధ్యాస మరిచిన పాలకులకు నేటి సమావేశంలో ఏం ప్రశ్నలు ఉత్పన్నం అవుతాయి అన్న దానిపై సందిగ్ధం నెలకొంది.

**పడకేసిన పాలనపై ఎన్నో ఆశలు:**
అసెంబ్లీ ఎన్నికల నుంచి మున్సిపల్ పాలన పడకేసిందనే చెప్పాలి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కౌన్సిల్ ఫోరంలో ఉన్న బిఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసానికి తెరలేపారు. అప్పటినుంచి పట్టణంలో 33 వార్డులలో నెలకొన్న సమస్య వలయంలో చిక్కుకుపోయాయి. కొన్ని రోజులు అవిశ్వాసం, మరికొన్ని రోజులు కమిషనర్ ల బదిలీలు , అంతలోగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా ఆరు నెలలుగా కౌన్సిల్ సమావేశానికి నోచుకోకపోవడం ఇక్కడేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మున్సిపల్ పాలకుల పనితీరుకు అద్దం పడుతుంది. నేటి నిర్వహించే కౌన్సిల్ సమావేశానికి సమస్యల స్వాగతం పలుకుతూ చైర్మన్ కు గుదిబండల మారబోతుంది. నేటి సమావేశం లో ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్ పుట్టపాకల మహేష్ అధ్యక్షతన జరగబోయే కౌన్సిల్ సమావేశంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలపై, ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలపై, 6 గ్యారంటీల్లో ఒకటైన గృహ జ్యోతి పథకంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య, వాళ్లలో నెలకొన్న డ్రైనేజీ , సిసి రోడ్లు, పార్కుల అభివృద్ధి, మీడియం ప్లాంటేషన్ పనులు, సెంట్రల్ లైటింగ్ పనులు, పెండింగ్ లో ఉన్న రోడ్ల విస్తరణ పనులు, తాగునీటి కోసం బోర్ల ఏర్పాటు, డంపింగ్ యార్డ్ చెత్త టెండర్, తైబజార్ టెండర్ , పలు టాక్స్ , కాంట్రాక్టర్లకు పెండింగ్ లో ఉన్న బిల్లులు సైతం, వార్షిక సంవత్సరంలో ట్రెజరీలో చల్లని చెక్కులు , డబుల్ బెడ్ రూముల్లో అవకతవకలు సంబంధించి అంశాలు పడకేయడంతో కొత్తగా కొలువుతీరిన కౌన్సిల్ కు సవాల్ గా మారబోతున్నాయి.

**ఏ నిధులతో సరి పెడతారు:**
బిఆర్ఎస్ హయంలో చేపట్టిన విస్తరణ పనుల్లో గత పాలకులు మున్సిపాలిటీ అభివృద్ధి పేరిట మున్సిపాలిటీ ఆదాయాన్ని ఆవిరి చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనరల్ ఫండ్ నిధులు, టాప్ఐడీసీ నిధులు, స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ సంబంధించిన మున్సిపాలిటీ ఖజానా ఖాళీ కావడంతో చివరకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి గట్టెక్కే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. గతంలో కౌన్సిల్ ప్రతిపాదించిన ఎజెండా అంశాలు పెండింగ్ లో ఉండడంతో ఏ మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకుంటారన్నదానిపై సర్వత్ర చర్చ మొదలైంది. నేడు జరగబోయే కౌన్సిల్ సమావేశంలో గత ఫోరంలో ఉన్న సభ్యులు, కొత్తగా కొలువుదీరిన పాలక వర్గం లో చర్చ సాగుతుందన్న దానిపై ఆసక్తి నెలకొంది.



# క్యాన్సర్ రోగులకు అన్నదానం

- రోగుల సహాయం చెయ్యడం దేవుడిచ్చిన వరం
- డాక్టర్ ఎస్ఎమ్ ముజీబ్

**విశాలభారతి, హైదరాబాద్:**అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, టీఎన్జీవోస్ యూనియన్, కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎమ్ హుస్సేని ఆధ్వర్యంలో క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో నిరుపేద 500 మంది రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహమారి క్యాన్సర్ వ్యాధి చికిత్స రోగుల సహాయకులకు అన్నదానం దేవుడు తనకిచ్చిన గొప్పవరమని అన్నారు. ఈ కార్యక్రమానికి ధైరం ఇస్తున్న కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు కె.ఆర్ రాజ్ కుమార్, కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్ర, ముక్తీమ్ ఖురేషి, శ్రీధర్ నాయుడు, మొహమ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్, ఆసుపత్రి సభ్యులు చంద్రశేఖర్, మొహమ్మద్ హబీబ్ చావుష్ పాల్గొన్నారు.



# టీ20 ఫైనల్ మ్యాచ్‌కు వర్షం ముప్పు?

**విశాలభారతి, హైదరాబాద్:** టీ20 ప్రపంచప్ ఫైనల్ మ్యాచ్ ఈరోజు బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్, కెన్సింగ్టన్ ఓవల్‌లో జరగనుంది. అక్కడి సమయం ప్రకారం ఉదయం 10.30 గంటకు, భారత కాలమానం ప్రకారం రాత్రి ఎనిమితి గంటలకు మ్యాచ్ రగనుంది. అయితే ఇప్పుడు ఈ ఫైనల్స్ మీద వర్ష మేఘాలు కమ్ముకున్నాయి. అక్కడా వాతావరణ పరిస్థితులను బట్టి మ్యాచ్ జరిగే సమయానికి వర్షం పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ సూచించింది.తెల్లవారుజామున 3 నుంచి 10 గంటల వరకు దాదాపు 50 శాతం వర్షం కురిసే అవకాశం ఉండగా, ఉదయం 11 గంటలకు తుపానుతో కూడిన వర్షం కురిసే అవకాశం 60 శాతం ఉన్నట్లు అక్కడి వాతావరణ శాఖ తెలిపింది. ఒకవేళ వాతావరణశాఖ చెప్పినట్టే జరిగితే ఫైనల్ మ్యాచ్ జరుగుతుందా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఒకవేళ మ్యాచ్ సమయం ఉండగానే వర్షం కురిసి పిచ్ తడి ఆరిపోతే అప్పుడే నిర్వహిస్తారు. అలాకాని పక్షంలో టైటిల్ మ్యాచ్ కోసం ఐసీసీ రిజర్వ్ డే ఉంచింది. జూన్ 29న మ్యాచ్ జరగకోతే...30వ తేదీన జరుగుతుంది. మ్యాచ్ కోసం అదనంగా 190 నిమిషాల సమయాన్ని కేటాయించింది ఐసీసీ. రెండు రోజుల పాటు ఇది అమల్లో ఉంటుంది. ఒకవేళ మ్యాచ్ శనివారం ప్రారంభమై మధ్యలో ఆగిపోతే.. ఆదివారం అక్కడి నుంచే ప్రారంభం అవుతుంది. ఒకవేళ రిజర్వ్ డే కూడా వర్షం పడితే మాత్రం రెండు జట్లనూ విజేతలుగా ప్రకటిస్తారు.

ఇప్పటివరకు జరిగిన మొత్తం వరల్డ్‌కప్‌లో భారత్, సౌత్ ఆఫ్రికా రెండు జట్లూ ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఫైనల్స్‌కు నేరుకున్నారు. వన్డే ప్రపంచప్‌లో చివరి నిమిషంలో కప్‌ను చేజర్చుకున్న టీమ్ ఇండియా ఇప్పుడు టీ 20 కప్‌ను సాధించి కసి తీర్చుకుందామని చూస్తోంది. మరోవైపు దక్షిణాఫ్రికా మొదటిసారి కప్‌ను గెలుచుకుని తమ మీద ఉన్న చోకర్స్ ట్యాగ్‌ను తొలగించుకోవాలని అనుకుంటోంది.

# ఫ్రైడే డ్రై డే పై ప్రజల్లో చైతన్యం పెంచాలి

- వర్షా కాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**వనపర్తి, విశాల భారతి::** ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేసి చైతన్యం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. వర్షాకాలంలో పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా శుభ్రం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో పాటు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో పర్యటించి డ్రై డే నిర్వహణను పరిశీలించారు. విపనగండ్ల మండలం గోవర్ధన గిరి, వీపన్ గండ్ల, చిన్నంబావి, అమ్మయిపల్లి గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో డ్రై డే సందర్భంగా ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు.. పరిసరాలు ఎలా ఉన్నాయి.. అనే విషయాలు పరిశీలించారు. డ్రై డే రోజున పంచాయతీ సెక్రెటరీ, అంగన్వాడి, ఆశ వర్కర్లను ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాలు పరిశీలించడమే కాకుండా ప్రజలకు డ్రై డే, దోమల వ్యాప్తి ఎలా జరుగుతుందో వివరించాలన్నారు. కలెక్టర్ స్వయంగా ఇళ్ల పరిసరాలు పరిశీలించారు. పాత డబ్బాలు, కుండల్లో నిలువ ఉన్న నీటిని పడేయాల్సిందిగా ఆదేశించారు. అనంతరం చిన్నంబావి మండలం తహశీల్దార్ కార్యాలయంలో ధరణి ఫిర్యాదులను పరిశీలించారు.

**అమ్మ ఆదర్శ పాఠశాలలో పనుల పరిశీలన:**
చిన్నం బావి మండలం వెల్టూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. విద్యార్థులకు తాగు నీటి కోలాయిలు, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్ లు ఏర్పాటు చేయడం పై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే చిన్నం బావి మండలంలో గ్రోమోర్ రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ నిలువ, విత్తనాల నిలువ, ఇప్పటి వరకు అమ్మిన విత్తనాలు, ఎరువులు, మిగిలిఉన్న స్టాక్ ను పోస్ టెర్మెండ్ యంత్రం తో సరిచూసుకున్నారు. స్టాక్ సరిపోవడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ సంచిత గంగ్వార్, వీపన గండ్ల ప్రత్యేక అధికారి లక్ష్మప్ప, చిన్నం బావి తహసిల్దార్ ఇక్బాల్, ఎంపీడీఓ రమణ, పంచాయతీ సెక్రటరీ లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

**వనపర్తి , విశాల భారతి::**జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి నార్కోటిక్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించగా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న గంజాయి సాగు కేసులు, మాదక ద్రవ్యాలు వాడుతున్న వారి కేసులపై ఆరా తీయగా డిఎస్పీ కృష్ణ కిషోర్ వివరాలు తెలిపారు. 2016 నుండి జిల్లాలో (3) గంజాయి సాగు చేస్తున్న వారిపై కేసులు ఉన్నాయని, వాడిన వారు 17 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. స్పందించిన జిల్లా కలెక్టర్ గంజాయి సాగు పై వ్యవసాయ విస్తీర్ణాధికారుల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సాగును గుర్తించాల్సిన బాధ్యత ఏ.ఈ.ఒ ల పై ఉందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో యాంటి డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని, కమిటీ లు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి ధ్రువీకరణ చేసి ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల ఉత్పత్తి కానీ వాడకం కానీ జరిగినట్లు తెలిస్తే 8712671111 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత గంగ్వార్, డి ఎఫ్ ఓ నవీన్ రెడ్డి, ఆర్డీఓ పద్మావతి, డిఎస్పీ కృష్ణ కిషోర్, అబ్కారీ శాఖ సుపటిండెంట్ ప్రభు వినయ్, రవాణా శాఖ అధికారి మానస, విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, సంక్షేమ శాఖ అధికారులు, డ్రగ్ ఇన్స్పెక్టర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్

**వనపర్తి, విశాల భారతి:** వర్షాకాలంలో వచ్చే సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులను అరికట్టేందుకు మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజలకు చైతన్యం చేయాలని మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలో అన్ని వార్డులలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన పలు వార్డులలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వాళ్లలో నెలకొన్న సమస్యలను, మురికి కాలువలను పర్యవేక్షించారు. వర్షా కాలంలో జాగ్రత్తలు తీసుకోకపోతే సీజనల్ వ్యాధుల పట్ల ఇబ్బందులు కలుగుతాయని సూచించారు. వార్డులలో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్, ఏడ్మిట్ లిక్విడ్ , ఫాగింగ్ వంటివి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చిర్ల విజయ చందర్, లక్కాకుల సతీష్, మున్సిపాలిటీ సిబ్బంది, ఆశ వర్కర్లు, హెల్త్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



# జిహెచ్ఎంసి నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**కాప్రా,విశాలభారతి:**జిహెచ్ఎంసి నూతన కమిషనర్ గా నియమితులైన ఐఏఎస్ అధికారిని ఆమ్రపాలిని మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ కార్యక్రమంలో చిలుక నగర్ కార్పొరేటర్ ,స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి , హెచ్ బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ ,మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, ప్రవీణ్ ముదిరాజ్, సాయి జెన్ శేఖర్ ,ఆకుల మహేందర్ ,నవీన్ గౌడ్ ,మహేష్ గౌడ్, జెట్ట కిషోర్ ,సుక్క కిరణ్ ,నిరంజన్ చారి రామ్ రెడ్డి, కంచర్ల సోమీ రెడ్డి, కాలేరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలి

**సీజేరియన్ ప్రసవాలపై చర్యలు తీసుకోండి**
**డెంగ్యూ వ్యాధులపై నివేదిక ఇవ్వాలి**




**వనపర్తి, విశాల భారతి::**సీజేరియన్ ద్వారా ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయని దీనిని నివారించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య శాఖ అధికారులు, డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదు అవుతున్న ట్రెయిమిస్టర్ లు, అనీమియా కేసులు, ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్లో జరుగుచున్న ప్రసవాలు, సీజనల్ వ్యాధుల పై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, సీజేరియన్ కాకుండా సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో 54 శాతం ప్రసవాలు జరుగుతున్నాయని అందులో 75 శాతం సీజేరియాన్ ద్వారా ప్రసవాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులను క్రమం తప్పకుండా సందర్శించి సిజేరియన్ కేసుల పై ఆరా తీయాలన్నారు. అవసరం లేకున్నా సిజేరియన్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వ్యాప్తి చెందకుండా దోమల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. జయ చంద్ర మోహన్, మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



# యూనివర్సిటీ సమస్యలను పరిష్కరించాలి

**ఓయూ, విశాలభారతి,** ఓయూని ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగ నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా దశాబ్దాలుగా కొనసాగుతున్న మెస్ చార్జీలు,స్కాలర్షిప్‌లు పెంచక పోగా ఉన్నటువంటి పెండింగ్ నిధులు విడుదల చెయ్యడంలేదని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ ఓయూ కన్వీనర్ మధు ఆరోపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాణ్యత లేని మెస్ కారణంగా అనేక మంది విద్యార్థులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. నూతనంగ విశ్వ విద్యాలయాలకు వస్తున్న విద్యార్థుల మీద విధించె మెస్ డిపాజిట్ విద్యార్థులకు శాపంగ మారుతుంది. ఉన్నత విద్యకు అధికంగ విద్యార్థినులు వస్తున్న సందర్భంగా వారికి ఉండె ప్రత్యేక ఆరోగ్య పరిస్థితుల ద్రుష్ట్యా వారి ప్రతీ హస్టల్‌లో మెడికల్ కిట్‌లను అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంతోపాటు ,ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో పూర్వపు ప్రజాస్వామిక వాతావరణాన్ని పునరుద్ధరించాలని రిజిస్ట్రార్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ ఫర్ పీస్&లిబర్టి ఓయు కన్వినర్ ప్రశాంత్ పగిళ్ళ,విద్యార్థులు మహేష్,కృష్ణ,అమీన్,థాయ్ కుమార్ పాల్గోన్నారు.



# పగలే వెలుగుతున్న వీధి దీపాలు

- క్షుణ్ణంగా కనిపిస్తున్న అధికారుల పర్యవేక్షణ లోపం



**ఇబ్రహీంపట్నం ,విశాలభారతి:**విద్యుత్ అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృధా అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యాచారం మండలంలోని మేడిపల్లి నక్కర్త గ్రామంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి . వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. యాచారం మండలంలో చాలా గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుం డడంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అవుతున్నది. ఫలితంగా విద్యుత్ శాఖ గ్రామ పంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రత్యేక లైన్ లు ఆన్ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం అవుతుంది. ప్రభుత్వం నిరంతరం విద్యుత్‌ను అందించడానికి వేల కోట్ల వెచ్చిస్తున్నా విద్యుత్‌ను ఆదా చేయాల్సిన సంబంధిత అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ ఆదాయం, జనాభా మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా రాత్రి పూట ఆన్ చేసి ఉదయం పూట ఆఫ్ చేయాలి. కానీ అలా జరగడం లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామాలలో వీధిలైట్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి ఆన్ఆఫ్ స్విచ్‌లను ప్రజలు కోరుతున్నారు



## బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

- **యాదగిరిగుట్ట నుండి కొమురవెల్లికి పాదయాత్ర**

**ఆలేరు, విశాలభారతి:** బడుగు బలహీన వర్గాల నాయకుడు ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని రాష్ట్రంలో 40 లక్షలు ఉన్న గొల్ల కురుమలకు మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పిస్తూ మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ యాదగిరిగుట్ట నుండి కొమురవెల్లి వరకు పాదయాత్ర చేస్తున్న యాదగిరిగుట్ట టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు రాజపేట మండలం కాల్వపల్లి గ్రామంకు చేరుకోగానే రాజపేట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇంజ నరేష్తో పాటుగా పాదయాత్ర కు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు వారితో పాటు యూత్ మండల నాయకులు కళ్లెం పాండు ,ఇంజ శ్రీరాములు, చేర్యాల నాగయ్య, యూత్ కాంగ్రెస్ కాలపల్లి అధ్యక్షులు ఇంజ రాజు, ఎన్ ఎస్ యు ఐ కాలపల్లి అధ్యక్షులు చేర్యాల విష్ణు, చక్రాల బాబు, పెంట పుండరీకం, పెంట సత్యనారాయణ, మడిపల్లి పోషయ్య,ఇంజ దాస్,చేర్యాల అనిల్ కుమార్,ఇంజ నరేష్,ఇంజ శ్రీకాంత్, కార్తీక్, బబ్లు, సంజయ్, తదితర నాయకులు గ్రామస్తులు పాల్గొని పాదయాత్ర విజయ వంతం కావాలని కోరుకున్నారు.

## మహిళలకు అన్నీ రంగాల్లో సమానత్వం కల్పించాలి

- **ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు టీ జ్యోతి**



**సూర్యాపేట, విశాలభారతి:** మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో సమానత్వం కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కేంద్ర కమిటీ సభ్యురాలు టి. జ్యోతి డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో రెండు రోజులపాటు జరగనున్న ఐద్వా సూర్యాపేట జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ మద్యం, డ్రగ్స్ ను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. గత పది సంవత్సరాల కాలంలో దేశంలో మహిళలపై హత్యలు హత్యాచారాలు పెరిగాయన్నారు. అనేక చట్టాలు వస్తున్నప్పటికీ వాటిని సక్రమమైన పద్ధతిలో అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా మహిళా లోకం తమ హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు.న్యూయార్ నగరంలో కుట్టు మిషన్ లో పనిచేసే శ్రామిక మహిళలు ఎనిమిది గంటల పని దినం కావాలి, అని పని ప్రదేశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, శ్రమకు తగ్గ వేతనం కావాలని, ఓటు హక్కు కావాలని, రక్తతర్పణం చేసి హక్కులు సాధించుకున్నారు. వారి త్యాగాలు వెలకట్టలేనిది అన్నారు. మహిళలు అన్ని రంగాలలో విద్యా, వైద్యంలో క్రీడాలలో శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందుకుపోతున్న మహిళల పట్ల వివక్షత, అసమానత లైంగిక వేధింపులు పెరుగుతున్నాయి అని ఆవేదన చెందారు. తరగతులలో ఐద్వా జిల్లా నాయకురాలు జూలకంటి విజయలక్ష్మి, అండం నారాయణమ్మ, సురభి లక్ష్మి, మునగాల జడ్పిటిసి దేవి రెడ్డి జ్యోతి, సృజన, నెమ్మాది లక్ష్మి, ముల్కురి మణెమ్మ, ఎడమ పద్మతదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్ లైన్ లీక్.. వృధా అవుతున్న నీళ్లు



**ఆలేరు, విశాలభారతి:** మున్సిపల్ పరిధిలోని ఆలేరు వాగు పై మిషన్ భగీరథ నీళ్లు పైప్ లైన్ లికేజీ అయ్యి వృధా గా నీళ్లు పోతున్న పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఒక వైపు వర్షాలు సరిగా కురవక నీటి ఏద్దడి ఎదురు కుంటున్న ప్రజలకు ఉన్న నీటిని సరిగా పంపిణీ చేయాల్సిన అధికారులు పైప్ లైన్ లికేజీ లు అవుతుంటే తక్షణమే గుర్తించి మరమ్మత్తులు చేయాల్సింది పోయి చూసి చూడనట్టు వ్యవహారిస్తుడటంతో సోషల్ మీడియా వేదికగా అధికారుల నిర్లక్ష్యం పై విమర్శలు గుప్పిస్తున్నారు నేటిజన్లు వెంటనే పైప్ లైన్ లీకేజీ మరమ్మత్తు పనులు చేయాలనీ డిమాండ్ చేస్తున్నారు.



## జివో 26 ను దుర్వినియోగం

- **మున్సిపాలిటీలో పెద్దఎత్తున అవినీతి**
- **మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్**

**సూర్యాపేట, విశాలభారతి:** జివో 26 దుర్వినియోగం చేస్తూ సూర్యాపేట మున్సిపాలిటీలో ప్రతి బిల్లు సహ కలెక్టర్ ద్వారా ఆమోదం చేస్తూ కౌన్సిలర్ లకు విలువ లేకుండా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో , వరదలు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు మాత్రమే జివో 26ద్వారా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేస్తారని, కాని సూర్యాపేట మున్సిపాలిటీ లో మాత్రం ప్రతి పనికి జివో 26 ను ఉపయోగిస్తూ, కౌన్సిలర్ లను డమ్మిలను చేస్తూ చైర్మన్ ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. బిఆర్ ఎస్ నాయకులు, కాంట్రాక్టర్ లను బాగు చేయడానికి నిధులను దుర్వినియోగం చేశారని విమర్శించారు. గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 28 బిల్లులు జివో 26ద్వారా ఆమోదింప చేసి , కౌన్సిల్ కు సమాచారం కోసం తెలియజేశారని అన్నారు. బాలెంల వద్ద గల డంపింగ్ యార్డ్ లో 90 లక్షల వ్యయంతో మిషనరీని మున్సిపాలిటీ కొనుగోలు చేసి, 13 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ద్వారా పనులు చేపిస్తూ, కాంట్రాక్టర్ కు సంవత్సరానికి 35 లక్షల రూపాయలు చెల్లింపులు చేస్తున్నారని, మున్సిపాలిటీ కి ఎటువంటి ఆదాయం లేకున్నా, మూడేళ్ల నుండి కోటి రూపాయలు చెల్లించి అవినీతి కి పాల్పడ్డారని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లు బైరు శైలేందర్, రాపర్తి శ్రీనివాస్, అనంతుల యాదగిరి, కుంభం రాజేందర్, బచ్చలకూరి శ్రీనివాస్, ధరావత్ రవికుమార్, నాయకులు సిరివెళ్ల శభరినాథ్, మాలోతు చంద్రు నాయక్ , ఆలేటి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



## యన్ డిసియంయస్ నూతన చైర్మన్ బోల్ల వెంకట్ రెడ్డికి శుభాకాంక్షలు

- **బిషప్ దుర్గం ప్రభాకర్**
- **జిల్లా క్రైస్తవ నాయకులు పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు**

**సూర్యాపేట, విశాలభారతి:** యన్ డిసి యంయస్ నూతన చైర్మన్ గా బోల్ల వెంకట్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా క్రైస్తవ నాయకులు, పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బిషప్ దుర్గం ప్రభాకర్ శుక్రవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే, శాలువాతో సత్కరించి వారికీ హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్నేహశీలీ, మృదుశ్వభావి, రైతు బిడ్డ యువనాయకులు, దళిత, బడుగు బలహీన వర్గాల అశా కిరణం కొప్పోలు గ్రామ బిడ్డకు ఇంత గొప్పbఅవకాశం వచ్చినదుకు ఆనందంగా ఉందని అన్నారు. ఇలాంటి పదవులు ఇంకా ఎన్నో అందుకోవాలని,ప్రజా సేవలో ముందు కెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమం లో కేతేపల్లి ఎంపిపి పెరుమాళ్ళ శేఖర్, కొప్పోలు గ్రామం కాంగ్రెస్ పార్టీ ఏడవ వార్డు మాజీ నెంబర్ దుర్గం శంకర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దుర్గం అంజి, పాల్వాయి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్

- **ఇల్లు కాలిపోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి**
- **ప్రభుత్వం అండగా ఉంటూ డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలి**
- **డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్**

**మరిపెడ, విశాలభారతి:** మరిపెడ మండలం తానంచర్ల కోటియ తండా గ్రామపంచాయతీలో జాను తండాలో గత కొన్ని రోజుల క్రితం ఇల్లు దగ్ధమైన విషయాన్ని తెలుసుకొని, అక్కడికి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే , మాజీ జెడ్పిటిసి బాల్నేని మాణిక్యంతో కలిసి వెళ్లే బాధ్యత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట తనంచర్ల మాజీ సర్పంచ్ ముఖేష్, బాలాజీ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ముందస్తు వరద సహాయ చర్యలు చేపట్టండి

- **తాసిల్దార్ కి మేమో రాండం ఇస్తున్న సిపిఎం బృందం**

**భద్రాచలం, విశాలభారతి:** వర్షాకాలం వచ్చిన సందర్భంగా రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఎటపాక మండల గ్రామాలు వరద ముంపుకు గురయ్యే అవకాశం ఉంది. కనుక ముందస్తుగా ఎటపాక మండల ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఇసంపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిపిఐ మండల నాయకత్వంఎటపాక మండల తాసిల్దార్ని కలిసి సమస్యలతో కూడిన మెమోరాండం అందించడం జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కామ్రేడ్ ఐవి మాట్లాడుతూ గతంలో వరదలు వచ్చినప్పుడు ప్రజలకు సహాయక చర్యలు అందించడంలో గత ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ప్రజలు అసౌకర్యానికి గురయ్యారని కొత్తగా వచ్చిన ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రణాళిక బద్ధంగా ముందస్తుగా వచ్చే వరదల ముంపునుండి ప్రజలను కాపాడాలని పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వైద్యం నిత్యవసర వస్తువులు సమకూర్చాలని ఆహార ఉత్పత్తులు సకాలంలో అందించి ప్రజలను కాపాడుకోవాలని ఆయన అన్నారు. పూర్తిగా వరద ముంపు గురై దెబ్బతింటున్న గ్రామాలకు ఆర్థిక సహకారం అందించాలని పంట నష్టానికి ప్రభుత్వమే భరించాలని ఆయన డిమాండ్ చేశారు. పోలవరం వరద తాకిడికి అనేక గ్రామాలు నీట మునిగిపోతున్నాయని ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి నెలకొంటుందని అందుకనే శాశ్వత పరిష్కారం చూపించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని స్థలాలు భూమి కోల్పోయిన వారికి భూమి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యవర్గ సభ్యులు దేగల మాధవ రావు, ఆకి శెట్టి రాము, మండల కమిటీ సభ్యులు జి హుస్సేన్ నాయకులు జి సుధాకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## పీవీ జయంతి సందర్భంగా ఘన నివాళులలు

**ఆలేరు, విశాలభారతి:** హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు లోని పీవీ ఘాట్ లో మాజీ ప్రధాని స్వర్గీయ పివి నరసింహరావు జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ పీవీ నరసింహారావు సంస్కరణలు అమలు చేయకపోయుంటే దేశం ఇవాళ ఈ స్థితిలో ఉండేది కాదన్నారు. భారతదేశం ఉన్నంతకాలం పివి చరిత్ర నిలిచి ఉంటుందన్నారు. పీవీ నరసింహారావు గొప్ప సంస్కరణల శీలి అన్నారు. ఆయన మేధావి కాబట్టే అద్భుతమైన పాలన అందించారన్నారు.స్థిత ప్రజ్ఞుడు బహుభాషా కోవిదుడు నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి పూర్వ ప్రధాని పివి నరసింహారావు ఆశయాలు సాధిస్తామన్నారు.



## మన అందరి ఆదర్శప్రాయుడు పీవీ నరసింహారావు

- **మంత్రి పొన్నం ప్రభాకర్**

**భీమదేవరపల్లి విశాల భారతి** భారతరత్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 103 జయంతి వేడుకలను తన స్వగ్రామమైన హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రోడ్డు రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ మాజీ ఎంపీ రాజయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. పివి విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. మంత్రి మాట్లాడుతూ వంగరలో పుట్టి పరిజ్ఞానంలో ప్రపంచంలోనే పీవీ నరసింహారావు ను మించిన వారు లేరని కొనియాడారు. ఆయన స్వగ్రామంలో జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. గతంలో మండల ప్రాంతానికి ప్రకటించిన అంశాలపై పివీ వాటర్ ప్లాంట్ , రోడ్డు ఇతర ఏ సమస్యలు ఉన్న శ్రద్ధ వహిస్తానని పేర్కొన్నారు. పీవీ నరసింహారావు స్ఫూర్తిగా ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకుపోవాలని అందరం కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితి అల్లకల్లోలం అవుతున్నప్పుడు భారతదేశాన్ని ప్రపంచ దేశంలో అగ్రగామిగా తీర్చిన గొప్ప మేధాశక్తి పివి అన్నారు. విద్యకు మొదటి ప్రాధాన్యత ఇచ్చినటువంటి గొప్ప మేధావి తన భూమిని పేదలకు పంచిన మహానుభావుడు అని కొనియాడారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు జీవితం నుంచి మౌనమనే పదాన్ని స్వీకరిస్తా అని అన్నారు. తద్వారా కెరీర్ లో ఎక్కడెక్కడ అవసరం పడుతుందో అక్కడ అప్లై చేసుకుంటూ పోతా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, కాజీపేట ఏసీపి తిరుమల్, ఎమ్మార్వో ప్రవీణ్, ఎంపీడీవో వీరేశం, కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## జీలుగు పంటను సందర్శించిన ఏఈఓ లక్ష్మణరావు

**పినపాక, విశాలభారతి:** ఈ బయ్యారం పంచాయతీ పరిధిలో గల రైతులకు జీలుగు సాగు చేస్తున్న పంట పొలాలను శుక్రవారం వ్యవసాయ శాఖ విస్తరణాధికారి కొమరం లక్ష్మణ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమ పరిధిలో గల వ్యవసాయ శాఖ అధికారులను కలిసి వారి సర్వే నెంబరుపై పంట నమోదు చేయించుకోవాలి అన్నారు. జీలుగు సాగుతో భూమిలో నత్రజని శాతం పెరిగి రైతులు పండించే పంట నాణ్యంగా పెరుగుతుందన్నారు. భూసారం ఎంతగా పెరిగితే అందులో మనం పండించే పంటలు అంతగా దిగుబడిని అందిస్తాయి అని అన్నారు. అందుకోసం చాలా మంది రసాయన ఎరువులు వాడుతుంటారు. దీంతో నేలల్లో పోషకాలు లోపించి, పంటలు కలుషితం అవుతున్నాయి అని,వరితోపాటు ఏ ఇతర పంటలు సాగు చేసినా ఎక్కువగా యూరియా, ఎన్పీకే ఎరువులనే ఉపయోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్టను సాగు చేయడంతో పొలాల్లో సహజంగానే ఈ ఎరువులు ఉత్పత్తి అవుతాయి అని వారు తెలిపారు. భూసారం పెరుగడంతోపాటు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్టను ఉపయోగిస్తే భూసారం పెరగడంతోపాటు అధిక దిగుబడి వస్తుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముక్కు బాలసుబ్బారెడ్డి, యాగంటి అంకిరెడ్డి, ముక్కు శివాజీ రెడ్డి , బట్ట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## మాదిగ దండోరా రజితోత్సవాలను విజయవంతం చేయాలి

- **స్టేట్ సెక్రటరీ , కోదాడ నియోజకవర్గ ఇన్చార్జి బాణాల అబ్రహం**

**అనంతగిరి, విశాలభారతి:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు , గౌరవనీయులు మేడి పాపయ్య మాదిగ , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాబాబు మాదిగ వారి ఆదేశాల మేరకు అనంతగిరి టౌన్ లో అనంతగిరి మండలం అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా స్టేట్ సెక్రటరీ , నియోజకవర్గ ఇన్చార్జి బాణాల అబ్రహం మాదిగ పాల్గొని కరపత్ర ఆవిష్కరణ చేయడం జరిగింది . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 7 , 1994 ఇదిమూడు గ్రామంలో ఏర్పడిన మాదిగ దండోరా ఉద్యమం , మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిగా ఏర్పడి ఏబిసిడి లక్ష్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి గ్రామ గ్రామాన , మండల , జిల్లాల వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమం బలంగా ఏర్పడినది . ఉద్యమంలో ఎంతోమంది అమరులైనారు. వచ్చి నెల ఏడో తారీఖున రవీంద్రభారతిలో మేడి పాపన్న నాయకత్వంలో రజిత ఉత్సవాలకు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో కొండ్రు బాబు , చిన్నం బాబు , కొండ్రు కృష్ణ , సూరపల్లి కిరణ్ , చిన్నం రాజశేఖర్ , సందీప్ , రాంబాబు తదితరులు పాల్గొన్నారు .



## లయన్స్ క్లబ్ గవర్నర్ కి సన్మానం

**చిట్యాల, విశాలభారతి:** నల్లగొండ ఖమ్మంకు సంబంధించిన లయన్స్ క్లబ్ కు గవర్నర్ గా గారాల ప్రభాకర్ రెడ్డి ఎన్నికై నల్లగొండ వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యం చిట్యాలలో రామన్నపేట లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ లయన్స్ క్లబ్ ను మరింత బలోపేతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రామన్నపేట లైన్స్ క్లబ్ అధ్యక్షులు సంజీవరెడ్డి, కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, కోశాధికారి గాలయ్య, చార్టర్ ప్రెసిడెంట్ యానాల కృష్ణా రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డా. పనకండి భాస్కర్ రావు, సిద్ధప్ప, వెంకటేశం, జిలకర ప్రభాకర్, గుప్త నర్సిరెడ్డి, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.



## రామంచ పాల కేంద్రం అధ్యక్షుడిగా మల్లారెడ్డి ఎన్నిక..

- డైరెక్టర్లుగా దొబ్బల తిరుపతి, సిద్ధంకి అర్జున్, శివరాత్రి ఎల్లయ్యలు ఎన్నిక...

**చిగురుమామిడి, విశాల భారతి:**కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ గ్రామ కరీంనగర్ డెయిరీ అధ్యక్షుడిగా కూతురు మల్లారెడ్డిని ఎన్నుకున్నట్లు డెయిరీ రూట్ సూపర్వైజర్ అప్పల మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మల్లయ్య మాట్లాడుతూ అధ్యక్షుడిగా కూతురు మల్లారెడ్డి, డైరెక్టర్లుగా దొబ్బల తిరుపతి, సిద్దెంకి అర్జున్, శివరాత్రి ఎల్లయ్యలను ఎన్నుకున్నట్లు చెప్పారు. అనంతరం పాలకేంద్రం అధ్యక్షుడు కూతురు మల్లారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు పాల ఉత్పత్తి దారులకు, డైరెక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు. డైరెక్టర్ల, పాల ఉత్పత్తిదారుల సహకారంతో పాలకేంద్రం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను పెంపొందించుకొని మరింత ఆర్థిక అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మానేటి మురళీధర్ రెడ్డి, పైస ఎల్లయ్య, వంటకాల సంపత్ రెడ్డి, తాళ్లపల్లి సంపత్, చెరుకు నవీన్, దాసరి రవి,పాలకేంద్రం కార్యదర్శి రంగు సంపత్,సిబ్బంది కోరేపు అనిల్,రంగు లక్ష్మణ్,తదితరులు పాల్గొనగా. కూతురు మల్లారెడ్డి ఎన్నిక పట్ల దొబ్బల బిక్షపతి హర్షం వ్యక్తం చేశారు.



## బీమా చెక్కు అందించిన బడుగుల లింగయ్య యాదవ్

**పాలకీడు, విశాలభారతి:** హుజూర్నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండలం జాబ్లా తండా గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త భూక్య కృష్ణ ఇటీవల కాలంలో విద్యుత్ షాక్ తో ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. మఠంపల్లి బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుల సహకారంతో ఇట్టి కార్యకర్త కుటుంబానికి రూ. 2 లక్షల రూపాయల బీమా చెక్కును మంజూరి చేయించడం జరిగింది. కాగా భూక్య కృష్ణ భార్య కమలకి సూర్యాపేట జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు బడుగుల లింగయ్య ఇట్టి చెక్కును అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారి పిల్లలు వేదశ్రీ, వెన్నెల, దేవ వెంకట్ పాల్గొన్నారు.



## ముళ్లపొదలను తొలగించిన శ్రీనివాస్ రెడ్డి..

- అభినందిస్తున్న ప్రజలు..

**చిగురుమామిడి, విశాల భారతి:**కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఓగులాపూర్ గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న ముళ్ళ పొదలను,చెత్తను ఆగ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి జెసిబి సహాయంతో శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఓగులాపూర్ కు వెళ్లే దారిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలతో రోడ్డు ప్రమాదకంగా మారిందని,గతంలో పలు ప్రమాదాలు జరిగాయని దృష్టిలో పెట్టుకొని ముళ్ల పొదలను తన సొంత డబ్బులు వెచ్చించి జెసిబి సహాయంతో తొలగించినట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజా ప్రతినిధిగా పదవి కాలం పూర్తయిపోయినప్పటికీ ప్రజల కోసం, ప్రయాణికుల రక్షణ కోసం సామాజిక దృక్పథంతో తుమ్మ పొదలను తొలగించిన శ్రీనివాస్ రెడ్డికి ఓలాపూర్ గ్రామస్తులు ప్రయాణికులు ధన్యవాదాలు తెలియజేస్తు వారి పనితీరును అభినందిస్తున్నారు.



## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శ

- విశ్వకర్మ సంఘం అధ్యక్షులు

**సైదాపూర్, విశాల భారతి** మండలంలోని ఎగ్లాస్పూర్ గ్రామంలో ఇటీవల రిటైర్డ్ కార్యదర్శి నర్సింగోజు నర్సయ్య మరణించారు. విషయం తెలుసుకుని ఆయన కుటుంబ సభ్యులను అఖిలపరిషత్ విశ్వకర్మ సంఘం సభ్యులు పరామర్శించి మృతుని ఫోటోకు పూలమాలవేసి నివాళులర్పించారు. అఖిలపరిషత్ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, ఎక్లాస్ పూర్ విశ్వకర్మ సంఘ అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, కొత్త మహేందర్, కొత్తపల్లి రవిందర్,నర్సింగోజు,సురేష్,కనక చారి ,ఇల్లందుల్ల రాజయ్య,వెంకట్ నర్సింగోజు వీరబ్రహ్మం తదితరులు పోల్లోన్నారు.

## మాజీ సీఎం కేసీఆర్ ను కలిసిన మల్లేష్ యాదవ్

- పార్టీ కోసం కష్టపడే వారికి ప్రాధాన్యత ఇస్తామన్న కేసీఆర్



**పటాన్‌చెరు,విశాలభారతి:**మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను పటాన్‌చెరు బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ కు పూల మొక్కను అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, పార్టీ కోసం కష్టపడే వారికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చినట్టు పటాన్‌చెరు మాజీ వార్డ్ మెంబర్ కొత్త గొల్ల మల్లేష్ యాదవ్ తెలిపారు. మాజీ సిఎంను కలిసిన కార్యక్రమంలో మల్లేష్ యాదవ్ తో పాటు సాయి, రాము, సురేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





## గీతంలో విజయవంతంగా ముగిసిన కార్యశాల

- ఎఫ్ జీపీలు, వాటి సామర్థ్యాలపై అవగాహన
- 40 మందికి సర్టిఫికెట్ల ప్రదానం

**పటాన్ చెరు,విశాలభారతి :**'ఎఫ్ జీపీలు, వాటి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవడం' అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం జూన్ 2728 తేదీలలో (గురుశుక్రవారాలలో) నిర్వహించిన రెండు రోజుల ప్రయోగాత్మక కార్యశాల విజయవంతంగా ముగిసింది. ఫీల్డ్‌ప్రోగ్రామబుల్ గేట్ అరేస్ (ఎఫ్ జీపీ)పై అధ్యాపకులు, పరిశోధకులకు సమగ్ర అవగాహన కల్పించడానికి, ఈ కార్యశాలలో ఎఫ్ జీపీ ఆర్కిటెక్చర్, డీజైన్ మెథడాలజీలు, ప్రోగ్రామింగ్ టెక్నికల్ పై దృష్టి సారించే సిద్ధాంతిక సెషన్ లో పాటు ప్రాక్టికల్ ల్యాబ్ లను నిర్వహించారు. సిగ్నల్ ప్రాసెసింగ్, ఎంటెడెడ్ సిస్టమ్స్, కృత్రిమ మేథతో సహా వివిధ రంగాలలో ఎఫ్ పీజీఎల బహుముఖ: అనువర్తనాలను అన్వేషించేలా ఇందులో పాల్గొన్న సదస్సులను ప్రోత్సహించారు. వాస్తవప్రపంచ కేస్ స్టడీస్, ప్రాజెక్టుల ద్వారా కోర్ ఎల్ టెక్నాలజీస్ అప్లికేషన్ ఇంజనీర్ జి.వేణుమాధవ్, బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ కె.వినోద్ కుమార్ లు మార్గనిర్దేశనం చేశారు. సంక్లిష్టసమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి ఎఫ్ జీపీ సామర్థ్యాన్ని వారు ప్రదర్శించారు. న దాదాపు 40 మంది అధ్యాపకులు, పరిశోధక సీజ్ విద్యార్థులకు, కార్యశాల విజయవంతంగా పూర్తయ్యాక ప్రశంసా పత్రాలను బహుకరించారు. ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి అతిథులను స్వాగతించి, సదస్యులకు పరిచయం చేయగా, కార్యశాల నిర్వాహకుడు ప్రొఫెసర్ ప్రశాంత ఆర్.ముడిమేల వందన సమర్పణ చేశారు.



## గణేష్ గడ్డ దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి:**పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయాన్ని శుక్రవారం ఉదయం పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధి గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, ఎంపీటీసీ రాజు, ఆలయ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కుమారుడు గూడెం విక్రమ్ రెడ్డి, గూడెం సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అన్ని రంగాల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- టిఎండిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్



**పటాన్ చెరు,విశాలభారతి:**దివ్యాంగులకు అన్ని రంగాలు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల చట్టం 2016 ప్రకారంగా తీవ్ర వైకల్యం కలిగిన దివ్యాంగులకు అధిక మద్దతు, ప్రత్యేక సదుపాయాలలో భాగంగా కేర్ టేకర్, కేర్ టేకర్ అలవెన్స్, స్పెషల్ హెల్త్ కార్డు, పౌష్టిక ఆహారం, పెన్షన్ పెంపుదలతో పాటు అన్ని రంగాల్లో 5% రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఇందు కోసం పలుమార్లు రాష్ట్ర మంత్రులకు, అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్టు తెలిపారు. ఇందులో భాగంగా బ్యాటరీ వీల్ చైర్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ఉత్సాహంతో పరుగులు తీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంతో పని చేయించుకోవాలని, ప్రత్యేక సదుపాయాలు సాధించుకోవాలని ప్రతి జిల్లాకు కోఆర్డినేటర్ ను నియమించడం జరిగిందన్నారు. ప్రత్యేక సదుపాయాలు సాధించుటకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సలహాలు సూచనలు అందించడంలో కోఆర్డినేటర్ల ఇంచార్జ్లుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలకృష్ణ కత్తుల వ్యవహరిస్తున్నట్లుగా తెలిపారు.





## కుక్కల దాడిలో బాలుడు మృతి

- మరోపసికందుకు తీవ్ర గాయాలు

**పటాన్ చెరు,విశాలభారతి:**కుక్కలు చిన్న పిల్లలపై దాడులు చేస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. శుక్రవారం ఒకే రోజు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు చిన్నారులపై కుక్కలు దాడి చేసిన ఘటనలో ఒక బాలుడు మృతి చెందగా, మరో పసికందు తీవ్ర గాయాల పాలైంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్నాపూర్ లో విశాల్ అనే ఎనిమిదేళ్ల బాలునిపై కుక్కలు దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఇస్నాపూర్ లోని మహీదర వెంచర్ లో బీహార్ కు చెందిన విశాల్ తల్లిదండ్రులు లేబర్ క్యాంపులో ఉంటూ నివాసం ఉంటున్నారు. విశాల్ కాలకృత్యాల కోసం వెళ్లగా ఒక్క సారిగా కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పటాన్ చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదిలా ఉంటే ముత్తంగిలో స్వాతి అనే ఏడు నెలల పసికందుపై కుక్క దాడి చేసి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని చికిత్స నిమిత్తం నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలతో చుట్టుపక్కల గ్రామాల్లో చర్చనీయంశమైంది. చిన్నారులు కుక్కల జోలికి వెళ్లకుండా తల్లిదండ్రులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మనుషుల పైన కుక్కల దాడిని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వాటికి సంబంధించిన టీకాలను ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## పేదరికం చదువుకు అడ్డు కాకూడదు

- పేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**పేదరికం చదవకు అడ్డు కాకూడదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే తన వంతు ఆర్థిక సహాయాన్ని అందించి ఓ పేద విద్యార్థికి భరోసా కల్పించారు. హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ కి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు కీశే శ్రీ రామ్ కుమార్,లత దంపతుల కుమార్తె ధరణి 10 తరగతి చదువు కోసం స్వంత డబ్బులతో ఈ విద్యా సంవత్సరంకు గాను పాఠశాల ఫీజు రూ. 20 వేల చెక్కు రూపేణా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ విద్యార్థిని తల్లికి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఉద్యమ కారుడు రామ్ కుమార్ గతంలో రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మానవతా దృక్పథంతో వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండలనే ఉదేశ్యంతో వారి కుమార్తె చదువుకు ఎటువంటి ఆటంకం కలాగకూడదనే ఉద్దేశ్యంతో స్వంత డబ్బులతో ఫీజులు చెల్లించినట్లు తెలిపారు.వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటూ ఆ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ వాళ్ల జీవితాలలో వెలుగులు నింపడానికి నా వంతు సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందించేందుకు అండగా ఉంటానన్నారు.విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పాఠశాల ఫీజు చెల్లించినందుకు ఎంతో సంతోషంగా ఉన్నాను. విద్యార్థిని ధరణి మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అందుకోవాలని, మంచి భవిష్యత్తు ను ఏర్పరచుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడలని ఎమ్మెల్యే గాంధీ విద్యార్థి ధరణి ని ఆశీర్వదించారు.ఎప్పుడు ఏ సహాయం కావల్సిన తన వంతు కృషి చేస్తానని విద్యార్థినికి ధైర్యాన్నిచ్చి భరోసా కల్పించారు. దీనికి విద్యార్థిని,కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మిద్దెల మల్లారెడ్డి విద్యార్థిని తల్లి శ్రీలత,తదితరులు పాల్గొన్నారు.



## పివీ తెలుగువారి ఠీవి

- ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**తెలుగువారి ఠీవి మన పీవీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అన్నారు. భారతదేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు ,ప్రధాని పదవి చేపట్టిన తొలి దక్షిణాత్యుడు, తెలంగాణ ముద్దు బిడ్డ ,గొప్ప రాజనీతిజ్ఞుడు,బహుభాషా కొవిందుడు,రచయిత, భారత రత్న,భారతదేశ మాజీ ప్రధానమంత్రి,స్వర్గీయ పాములపర్తి వేంకట నరసింహారావు అని ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.శుక్రవారం పివీ జయంతి సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలకు ఊతం ఇచ్చి, భారతదేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన తెలంగాణ ముద్దుబిడ్డ, పి.వి. నరసింహారావు అని కొనియాడారు.గొప్ప దార్శనికుడు,ఆయన జీవితం భావితరాలకు ఆదర్శమని, ప్రధాని పదవి చేపట్టిన ఒకే ఒక్క తెలుగువాడు మన పీవీ అని గుర్తు చేశారు. భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజంవేసి, కుంటుపడిన వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనతను సొంతం చేసుకున్న వ్యక్తి పివి నర్సింహారావు అని తెలిపారు. శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ఆరంభించిన పి.వి రాష్ట్రమంత్రిగా, ముఖ్యమంత్రి గానే కాకుండా దేశ రాజకీయాలలో కూడా ప్రవేశించి ప్రధానమంత్రి పదవిని చేపట్టి దేశానికి దిశా నిర్దర్షన్ చూపించాలన్నారు.ఈ కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు శర్మ,కాశినాథ్ యాదవ్ ,పోతుల రాజేందర్, చంద్రమోహన్ సాగర్, రాము, మల్లయ్య,రజినీకాంత్, శివ సాగర్, రవి,జగన్, అంజలి,తదితరులు పాల్గొన్నారు.




## అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టండి

- ఏండ్లు గడుస్తున్నా నిర్మాణం జరగని వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు , అధికారులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- వంతేన ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన

**ఇబ్రహీంపట్నం ,విశాలభారతి:**ఏండ్లు గడుస్తున్నా పాలకులు పట్టించుకోవడంలేదని , అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం పనులు తక్షణమే చేపట్టాలని బీజేవైఎం శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బీజేవైఎం ఇబ్రహీంపట్నం అసెంబ్లీ కన్వీనర్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలోశేరిగూడ మంగల్ పల్లి రోడ్డులో బ్రిడ్జి నిర్మాణం దగ్గర టెంటు వేసుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు యాదిష్ హాజరై మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణం ఎన్నోఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. సాగర రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలన్నారు. పాలకులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి బూర దిలీప్ , నేతలు పగడాల శ్రీశైలం, శాంతి కుమార్ , రవీందర్ రెడ్డి , నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
శనివారం, 29.06.2024
హైదరాబాద్




## ఎస్సై వాస ప్రవీణ్ కుమార్‌పై అసత్య ఆరోపణలు సరికాదు

**శాలిగౌరారం, విశాలభారతి:** ఉన్నత చదువులు చదువుకుని బలహీన వర్గాల నుండి వచ్చే ఎస్సి కులానికి చెందిన ఉన్నతాధికారిపై అసత్య ఆరోపణలు సరికాదని దళిత సంఘాల నాయకులు దేవరకొండ శంకర్ అన్నారు. ఆయన శుక్రవారం శాలిగౌరారం లో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ శాలిగౌరారం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పై కొంతమంది నాయకులు పైరవికారులు వారికి అనుకూలంగా పోలీస్ స్టేషన్లో పనులు జరగకపోవడం కారణంగా ఎస్సై పైన కావాలనే అసత్య ప్రచారం చేస్తూన్నారన్నారు.ఎస్సీ కులానికి చెందిన దళితునిపై కావాలని నిరాధారణరోపణలు చేయడాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రింగు రాంబాబు, దేవరకొండ మస్తాన్ డి.సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల ముద్దు.. ప్రైవేట్ పాఠశాల వద్దు

**భీమదేవరపల్లి విశాల భారతి** ప్రభుత్వ పాఠశాల ముద్దు ప్రైవేట్ పాఠశాల వద్దు అంటూ మండలంలోని కొత్తకొండ గ్రామంలోని యువకులు గ్రామస్తులు శుక్రవారం ప్రైవేట్ స్కూల్ బస్సు అడ్డుకున్నారు. ప్రభుత్వ పాఠశాల లో మౌలిక సదుపాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఉచిత పుస్తకాలు మధ్యాహ్న భోజనం ఉచిత దుస్తులు అందిస్తుందని గ్రామంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని యువకులు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు క్రమశిక్షణ నైపుణ్యత కలిగి ఉంటారని తెలిపారు. ఎందరో మేధావులు నాయకులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించారని చెప్తూ తల్లిదండ్రులలో, విద్యార్థులలో ప్రేరణ కలిగించారు.ఈ మధ్య వేలువడిన పదో తరగతి ఫలితాలను చూసినట్లయితే ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని తెలిపారు. గ్రామంలోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని రాబోయే తరాలకు ప్రభుత్వ పాఠశాలలు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని యువకులు,గ్రామస్థులు పిలుపునిచ్చారు.





## నరేంద్ర మోడీ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- పిడిఎస్ -యు పి వై ఎల్ డిమాండ్

**ఆత్మకూరు(ఏస్), విశాలభారతి:** ఎంబీబీఎస్,ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిం నీట్ యూజీ ఎంట్రన్స్ లో అవకతవ కలు జరిగాయన్న ఆరోపణలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆత్మకూరు(ఏస్) మండలం కేంద్రంలో పిడిఎస్యు పివైఎల్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు నలగొండ నాగయ్య, పిడిఎస్యు డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్ మాట్లాడుతూ ఎంబీబీఎస్,ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకొరకు నిర్వహించిన నీట్ యూజీ ఎంట్రన్స్ లో అవకతవ కలు జరిగాయన్న ఆరోపణలకు దేశ ప్రధాని మోదీ ఇప్పటివరకు స్పందించకపోవడం సిగ్గుచేటని,బిహార్ లో రూ.30 లక్షలకు నీట్ ప్రశ్నపత్రాలు విక్రయించారని,ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నప్పటికీ కేంద్రం నరేంద్ర మోడీ ప్రభుత్వం నిమ్మ కు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని వారు మండి పడ్డారు. నిట్ పరీక్ష ఫలితాలలో 67 మందికి మొదటి ర్యాంకు ఎలా? సాధ్యమైందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.నీట్ పరీక్షలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకులు రావడం ఎన్నో అనుమానాలకు తావిస్తుంది అని అన్నారు.ఒకే సెంటర్ నుంచి పరీక్ష రాసిన 8 మంది విద్యార్థులకు 720 మార్కులు రావడం చూస్తే బీజేపీ హయాంలో పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో స్పష్టంగా కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తున్నది అని అంటున్నారు. ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలను విడుదల తేదీలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించడం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు. ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్) చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు పరమేష్, సాయి, గణేష్, సంపత్, గోపి, మహేష్. పాల్గొన్నారు.





**సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు**
**ఫాన్స్ అసోసియేషన్ కట్టంగూర్ మండలం అధ్యక్షుడుగా మల్లెబోయిన శ్రీకాంత్ ముదిరాజ్ ఎన్నికయారు ,ఈ సందర్బంగా తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గండూరి నర్సిహ్మ ముదిరాజ్ చేతుల మీదగా ఆర్డర్ కాపీ అందుకున్నారు. తదనంతరం శ్రీకాంత్ ముదిరాజ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు**



## ఎంపీ చామల ప్రమాణస్వీకారంలో పాల్గొన్న మసనం శ్రీను

**చౌటుప్పల్ విశాలభారతి:** మున్సిపాలిటీ పరిధిలోని 10 11వ వార్డు చెందిన మసనం లక్ష్మయ్య ఫౌండేషన్ చైర్మన్ మసనం శ్రీను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో ప్రమాణస్వీకారం శ్రీకారం కార్యక్రమంలో పాల్గొని వారిని ఘనంగా సన్మానించడం జరిగినది. తదనంతరం ఏఐసీసీ రాష్ట్ర నాయకులు మరియు జాతీయ నాయకులు అజయ్ కుమార్, మహేందర్ జోషి, రోహిత్ చౌదరి, హరిహర వేణుగోపాల్, ను కలిసి వారికి కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



## ఫోటో రైటప్ హెడ్ వర్క్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

- పల్లివాడ హెడ్ వర్క్ ను పరిశీలించిన ఎమ్మెల్యే సామేలు

**శాలిగౌరారం,విశాలభారతి:** మండల కేంద్రంలో ఉన్న ప్రాజెక్ట్ లోకి నీరు అందించే తుర్కపల్లి సూరారం, పల్లివాడ హెడ్ వర్క్ ను తుంగతుర్తి ఎమ్మెల్యే మందల సామేలు శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఏరులోకి నీటిని వృధా పోకుండా శాలిగౌరారం ప్రాజెక్టులోకి పూర్తిగా మళ్ళించి నింపాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టులోకి నీరు అందించే కాల్వ అధ్వానంగా ఉందని గత ప్రభుత్వాలు, అధికారుల ఐబీ అధికారులు నిర్లక్ష్యం తోని ఇలా మారిందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇట్టి విషయంపై ఐబీ ఎస్ఈ తో మాట్లాడివెంటనే కాలువ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వీరి వెంట ఐబీ ఈఈ, డీఈ, ఏఈ సత్యనారాయణ, విజయకుమార్, రాములు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సమరం రెడ్డి, నకిరేకల్ మార్కెట్ మాజీ చైర్మన్ చాడ సురేష్ రెడ్డి, చామల వెంకటరమణారెడ్డి, బండపల్లి కొమురయ్య ,గూని వెంకటయ్య,చింత ధనంజయ, వేముల గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఎద్దు మృతి

- బాధిత రైతు బానోత్ టీక్యా
- మండలంలో ఎన్నో వరస ఘటనలు

**మరిపెడ ,విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలం ఎలమంచి తండ లో విద్యుత్ షాక్ తో బానోతు టిక్యి ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు 50 వేలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మరిపెడ మండలంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఇలాంటివి ఎన్నో వరస ఘటనలు జరుగుతున్న విద్యుత్ అధికారులు నిమ్మకు నీరెత్తనట్టు గా వ్యవహరిస్తున్నట్టు గా గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలపై తక్షణమే సంబంధించిన అధికారులు స్థానిక కలెక్టర్ స్పందించి రైతులకు న్యాయం కలిగే విధంగా పాడి పశువులు మరల ఇలా చనిపోకుండా తగిన మరమ్మత్తులు చేయాలని రైతులు కోరుకుంటున్నారు.



## ప్రతి ఫిర్యాదు పై స్పందించాలి

- కాజీపేట ఏసీపీ తిరుమల్

**భీమదేవరపల్లి విశాల భారతి** పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదు పై వెంటనే స్పందించి విచారణ జరిపి బాధితులకు భరోసా ధైర్యాన్నిచ్చేలా పనిచేయాలని కాజీపేట ఏసిపి తిరుమల్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్ స్టేషన్ ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ లో సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లోని గదులను, పలు రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లో, గ్రామాల్లో సిసి కెమెరా గురించి ప్రజలకు అవగాహన కల్పించి సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. వీరి వెంట సీఐ ప్రవీణ్ కుమార్ ఎస్సై వెంకటేశ్వర్లు ఉన్నారు.



## భూదాన్ భూములను కాపాడాలి


- తూర్పునూరి రవి కాంగ్రెస్ యువ నాయకులు

**చౌటుప్పల్, విశాలభారతి:** మున్సిపల్ కేంద్రంలోని 13వ వార్డు లో 174, 175 సర్వే నెంబర్లో గల భూదాన్ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తప్పుడు సర్వే నెంబర్లను వేసి అక్రమంగా ప్లాట్లను చేసి సామాన్యులకు అంటగట్టారని దీని వలన వారికి ఇంటి పర్మిషన్ తో సహా లోన్ రావడం కష్టంగా అయితుందని కావున ఆ భూమిని నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించి అట్టి భూమిని స్వాధీన పరుచుకొని అందులో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని ఆ రియల్ ఎస్టేట్ మాఫియా దగ్గర భూమిని కొనుగోలు చేసిన నిరుపేదలకు న్యాయం చేయాలని కోట్ల విలువ చేసే భూదాన్ భూమిని ప్లాట్లుగా చేసిన వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేయాలని ఆర్డీవో కి మండల యూత్ కాంగ్రెస్ నాయకులు తూర్పునూరి రవి గౌడ్ వినతి పత్రం అందింస్తూ వారిని కోరాను.



## క్యాటరింగ్ టెండర్‌లో అవకతవకలు

**మహబూబాబాద్ విశాలభారతి:** సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్య సంవత్సరం 202425 గాను ఆహార పదార్థాలు మరియు క్యాటరింగ్ గుత్తెదారులను టెండర్లకు పిలవడం జరిగింది. వారు ఎంతో ఆశతో 1000 రూపాయలు ఖర్చు చేసి అప్లికేషన్ ఫారమ్స్ కొని 100000 లక్ష రూపాయలు డి.డి లు తీసి టెండర్లు వేయడం జరుగుతుంది. ఆ యొక్క టెండర్ల ను అడిషనల్ కలెక్టర్ గారి ముందు ఓ పెన్ చేసి టెండర్ ప్రక్రియ ని మొదలు పెడతారు కానీ కళాశాల లో పని చేసే ప్రిన్సిపల్స్ ఆక్కడ వారికి నచ్చిన వారికి వల్లకు కమిషన్ ఇచ్చే వారికి సపోర్ట్ చేస్తూ అడిషనల్ కలెక్టర్ కి తెలుగు రాదు అనే ఒక చిన్న విషయం తో వారిని తారుమారు చేస్తూ గతంలో అందులోనే చేసి న్యాపుణ్యం ఉన్నవారికి కాకుండా గత రెండు సంవత్సరలుగా అన్ని సర్టిఫికెట్స్ ఉన్న వారికే ఇస్తాం అని ఒక్క సర్టిఫికెట్ లేకపోయినా ఇవ్వలేదు కానీ ఈ సంవత్సరం దానికి భిన్నంగా ఏ సర్టిఫికెట్ లేకపోయినా ఎలాంటి నైపుణ్యం లేకపోయినా, 5 రూపాయిలు ఉన్న కోడ్ ని అతి తక్కువ ధర అని కూడా తెలిసి 1 రూపాయి కోడ్ చేసిన, వాళ్ళకి బినామీ గా ఉన్న వాళ్ళకి ఇస్తున్నారు.





## గృహజ్యోతి పథకం కొందరికేనా

**ఇందల్ వాయి విశాల భారతి:**ఇందల్వాయి మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజాపాలన దరఖాస్తు చేసిన మహిళలకు గృహ జ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అని ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇంతవరకు చాలా గ్రామాలలో ప్రజలకు గృహ జ్యోతి పథకం అందడం లేదు. గ్రామాలలో విద్యుత్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్య అంతా ఇంతా కాదు. గృహ జ్యోతి అప్లికేషన్ లలో అధికారులు నిర్లక్ష్యం చూపుతూ ప్రజలు విద్యుత్ అధికారులపై ప్రశ్నాహితంగా మారింది. కొందరికి మాత్రమే ఉచిత విద్యుత్ సబ్సిడీ ఎలా వస్తుందని, మాకు ఎందుకు రాదని వారు ప్రశ్నిస్తున్నారు. ఎన్నిసార్లు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న ఇంతవరకు ప్రజలకు అందడం లేదని వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందించే గృహజ్యోతి పథకం కోసం ప్రజలు, విద్యుత్ అధికారులు గొడవ పడకుండా తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని, విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.



## అపార మేధావి పీవీ నరసింహారావు జయంతి వేడుకలు

**సైదాపూర్, విశాల భారతి** మండల కేంద్రంలో బహుముఖ ప్రజ్ఞశాలి, అపార మేధావి, మాజీ ప్రధానమంత్రి భారతరత్న పీవీ నరసింహా రావు 103వ జయంతి ఘనంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంత సుధాకర్ ఆధ్వర్యంలో చిత్రం పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ విప్లవాత్మక సంస్కరణలు, సాహసోపేత నిర్ణయాలతో భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు పునాదులు వేశారని గుర్తుచేస్తూ ఈ కార్యక్రమంలో కూతురు విద్వాన్ రెడ్డి,గొల్లపల్లి యాదగిరి,మేకల రాజు,జంపాల చంద్రయ్య,మోహన్ నాయక్, వెంకటేశ్వర్లు,యూత్ నాయకులు బోనగిరి అనిల్, వేముల సాయి, బోనగిరి సందీప్,మాడెపు రాహుల్, తిరుపతి నాయక్,రోషన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు

**మహబూబాబాద్, విశాలభారతి:** గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న డిప్యూటేషన్లను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిడి ఎర్రయ్య కి వినతిపత్రం అందజేసినారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాష్ట్రం లోనే అత్యధిక గిరిజనులు ఉన్న మహబూబాబాద్ జిల్లాలో డిప్యూటేషన్ల మీద ఆ శాఖ కొనసాగడం ఏంటని ప్రశ్నించారు. ఒక ఉద్యోగి ఒక చోట నుండి వేతనం తీసుకుంటు అదే శాఖలో వేరోక చోట ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. దీని వలన ఉద్యోగి లేని చోట స్కూల్ టీచర్లతో నడిపించాల్సిన పరిస్థితి ఏర్పడింది అన్నారు. ఈ డిప్యూటేషన్లను మీదనే గత కొన్ని సంవత్సరాల నుండి మహబూబాబాద్ గిరిజన శాఖ




నడుస్తుంది అన్నారు. ఈ డిప్యూటేషన్లను మీద సరైన వివరణ ఇచ్చే అధికారులే కరువయ్యారని అన్నారు. ఈ డిప్యూటేషన్లు పిఓ కి, కలెక్టర్ కి తెలిసి జరగడం లేదు అని ఆరోపించారు. కావున తక్షణమే డిప్యూటేషన్లల మీద కొనసాగుతున్న ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గుగులోత్ సూర్య ప్రకాశ్, గందసిరి జ్యోతి బసు, వీరెందర్, రవీందర్ పాల్గొన్నారు.

## డబుల్ ఇస్మార్ట్.. అసలు సౌండ్ కు టైమ్ ఆగయా



ఉస్తాద్ రామ్ పోతినేని, డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా సినిమా "డబుల్ ఇస్మార్ట్". ఇస్మార్ట్ శంకర్ తో బాక్సాఫీస్ వద్ద సాలీడ్ సక్సెల్ అందుకున్న ఈ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకులను మరోసారి ఆకట్టుకునేందుకు సిద్దమైంది. పూరీ జగన్నాథ్, చార్మీ కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదల డేట్ పై ఇటీవల పలు రకాల గాసిప్స్ వైరల్ అయిన విషయం తెలిసిందే. అసలైతే డబుల్ ఇస్మార్ట్ సినిమాను ఈ ఏడాది మార్చి లోనే విడుదల చేయాలని అనుకున్నారు. కానీ మధ్యలో పలు కారణాల వలన బ్రేక్ ఇచ్చిన పూరి టీమ్ విడుదల డేట్ ను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఇక ఫైనల్ గా సినిమా స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఆగస్టు 15న విడుదల కానుంది. సినిమా రెగ్యులర్ ప్రమోషన్స్‌ను ప్రారంభించేందుకు మేకర్స్ సిద్ధంగా ఉన్నారు. మేజికల్ కంపోజర్ మణిశర్మ, మొదటి భాగానికి సంగీతం అందించినప్పుడు ఏ స్థాయిలో రెస్పాన్స్ వచ్చిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక బెస్ట్ సాంగ్స్ ఇచ్చిన మణిశర్మ ఇప్పుడు మళ్ళీ సెకండ్ పార్ట్‌కు సంగీతం అందిస్తున్నారు. మొదటి సింగిల్ "స్టెప్ మార్" ను జూలై 1న విడుదల కానుందని మేకర్స్ ప్రకటించారు. ఒక స్ట్రైకింగ్ పోస్టర్ విడుదల చేయగా అందులో రామ్ పోతినేని స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ, లార్డ్ శివా విగ్రహం ముందు డ్యాన్స్ చేస్తున్నట్లు చూపించారు. ఈ సాంగ్ ఎలక్ట్రిఫయింగ్ ట్యూన్‌గా ఉంటుందట, మాస్ ఆడియెన్స్‌ను వెంటనే ఆకర్షించేలా ఉంటుందని చెబుతున్నారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ పాటకు భాస్కర భట్ల లిరిక్స్ రాయగా, అనురాగ్ కులకర్ణి వాయిస్ అందించారు. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంపై ఉన్న హైప్ ఆకాశాన్నంటుతోంది. ప్రధాన విలన్ పాత్రలో సంజయ్ దత్ కనిపించనుండగా, కావ్యా థాపర్ హీరోయిన్ గా నటిస్తున్నారు.

## ఫిట్‌నెస్‌తోనే ఆనందం అందం



ఆరోగ్యమే మహాభాగ్యం. ఆరోగ్యం లేనిదే ఏదీ లేదు. ఎంత ధనికులు అయినా అనారోగ్యంతో ఉన్నప్పుడు వారు కోరుకునేది కేవలం తాను ఆరోగ్యంగా ఉంటే చాలు అని...! నేటి ఆధునిక ఒత్తిళ్ల జీవితంలో ప్రజలకు లేనిదే అది. దీనికి సామాన్యులు సెలబ్రిటీలు అనే తేడా లేదు. అందాల కథానాయిక సమంత రూత్ ప్రభు ఇంతకుముందు మయోసైటిస్ లాంటి ఆటో ఇమ్యూన్ వ్యాధితో పోరాడిన సంగతి తెలిసిందే. అనారోగ్యంతో పోరాడి విజేతగా నిలిచింది సామ్. అయితే తన విజయంలో శారీరక శ్రమ, ఫిటెనెస్ నియమాలు ప్రధాన భూమిక పోషించాయి. యోగా, జిమ్, డ్యాన్సింగ్ సెషన్స్ తో పూర్తిగా సమంత మానసిక, శారీరక ఆరోగ్యాలను సంపాదించుకుంది. అన్ని కలతల నుంచి బయటపడటానికి ఫిట్ నెస్ రొటీన్ ఉపకరించింది. ఇక సమంత ఫిట్‌నెస్ శిక్షణ గురించి ఎంత చెప్పినా తక్కువే. తను ఎప్పటికప్పుడు వైవిధ్యమైన శారీరక వ్యాయామాలను ఎంచుకుంటోంది. ఇప్పుడు పోల్ డ్యాన్స్ తో ఫిట్ నెస్ సూత్రాన్ని అనుసరించడం ఆసక్తిని కలిగిస్తోంది. తాను కోలుకునే ప్రయాణంలో భాగంగా వివిధ రకాల శారీరక శ్రమలను అన్వేషిస్తోంది. దీనికోసం రకరకాల వ్యాయామాలు, డ్యాన్సుల్లో శిక్షణ పొందుతోంది. తాజాగా సమంత షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ లో ముంబైలో ప్రముఖ పోల్ డ్యాన్స్ శిక్షకురాలు జోన్ మిచెల్‌తో డ్యాన్స్ సెషన్ తర్వాత సమంత సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన పోస్ట్‌ను షేర్ చేసారు. ఈ అనుభవం అద్భుతం అంటూ తన పోల్ డ్యాన్స్ అనుభవం గురించి వెల్లడించారు. శరీరాన్ని నిరంతరం ఉత్తేజితంగా ఉంచడం ద్వారా అన్నిరకాల రుగ్మతలకు చెక్ పెట్టవచ్చనే ప్రాథమిక సూత్రాన్ని తూ.చ తప్పక అనుసరస్తోంది సామ్. తను ఇప్పుడు పూర్తిగా ఫిట్ గా ఉంది. నటిగా కెరీర్ పరంగా స్పీడ్ పెంచేందుకు అన్నివిధాలా సిద్ధంగా ఉంది. ప్రస్తుత కెరీర్ విషయానికి వస్తే... సమంత తదుపరి `బంగారం` చిత్రంలో కనిపించనుంది. ఈ సినిమాతో నిర్మాతగాను సామ్ ఆరంగేట్రం చేస్తుంది. వరుణ్ ధావన్‌తో కలిసి `సిటాడెల్: హనీ బన్నీ`లో నటించింది. రాజ్ అండ్ DK దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఈ సంవత్సరం OTTలో ప్రీమియర్ అవుతుంది.

## "కల్కి" లో అర్జునుడి క్యారెక్టర్ లో ఆకట్టుకుంటున్న విజయ్ దేవరకొండ




రెబెల్ స్టార్ కల్కి సినిమా నిన్న ప్రేక్షకుల ముందుకొచ్చి రికార్డ్ స్థాయిలో ఓపెనింగ్స్ అందుకుంది. వైజయంతీ మూవీస్ లో దర్శకుడు నాగ్ అశ్విన్ ఫ్యూచరిస్టిక్ ఇండియన్ సినిమాగా కల్కిని రూపొందించాడు. ఈ సినిమాలో అనేక గెస్ట్ రోల్స్ ఉన్నాయి. వాటిలో హైలైట్ అవుతోంది విజయ్ దేవరకొండ నటించిన అర్జునుడి పాత్ర. ఈ క్యారెక్టర్ లో విజయ్ పర్ఫెక్ట్ గా సరిపోయారు. అర్జునుడు కురుక్షేత్ర యుద్ధ సందర్భంలో చూపించే బలమైన ఎమోషన్స్ తన నటనతో పలికించారు విజయ్ దేవరకొండ. నిడివి తక్కువే అయినా అర్జునుడిగా విజయ్ మేకోవర్, చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్స్ కల్కిలో ఒక హైలైట్ గా నిలుస్తున్నాయి. విజయ్ క్యారెక్టర్ స్క్రీన్ మీదకు వచ్చినప్పుడు ప్రేక్షకుల నుంచి హ్యూజ్ అప్లాజ్ వస్తోంది. విజయ్ ను మైథాలజీ పాత్రల్లో చూసే అవకాశం అరుదు కాబట్టి కల్కి సినిమా ఆయన కెరీర్ లోనూ ఓ స్పెషల్ మూవీ అనుకోవచ్చు.

## దీపికా.. కల్కితో మరో బిగ్ రికార్డ్ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకునే ప్రస్తుతం పాన్ వరల్డ్ హీరోయిన్ గా తనదైన బ్రాండ్ క్రియేట్ చేసుకుంది. అలాగే అత్యధిక బ్రాండ్ వేల్యూ ఉన్న హీరోయిన్స్ లో దీపికా పదుకునే నెంబర్ వన్ స్థానంలో ఉంది. కెరియర్ ఆరంభంలో కన్నడంలో ఉపేంద్రకి జోడీగా ఆమె తన మొదటి సినిమా చేసింది. తరువాత షారుఖ్ ఖాన్ ఓం శాంతి మూవీతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకునే ఛాన్స్ లేకుండా స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. హాలీవుడ్ మూవీలో కూడా దీపికా పదుకునే నటించింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఇండియాలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న స్టార్ హీరోయిన్ గా దీపికా పదుకునే ఉంది. ఈమె గత ఏడాది షారుఖ్ ఖాన్ కి జోడీగా పఠాన్, జవాన్ సినిమాలలో నటించింది. ఎందుకంటే.. ఈ రెండు సినిమాలు వెయ్యి కోట్లకి పైగా కలెక్షన్స్ రాబట్టాయి. బ్యాక్ టూ బ్యాక్ వెయ్యి కోట్ల కలెక్షన్స్ సాధించిన సినిమాలలో భాగమైన హీరోయిన్ గా దీపికా పదుకునే అరుదైన ఘనత సాధించింది. ఇదిలా ఉంటే ఈ బ్యూటీ లీడ్ రోల్ చేసిన కల్కి 2898ఏడీ మూవీ తాజాగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి స్టార్స్ నటించిన పాన్ వరల్డ్ మూవీగా ఈ చిత్రం రిలీజ్ అయ్యింది. ఈ మూవీలో కల్కికి జన్మనివ్వబోయే తల్లిగా దీపికా పదుకునే పాత్ర ఉంటుంది. మూవీలో ఆమె పాత్ర చాలా బలంగా, పెర్ఫార్మెన్స్ కి స్కోప్ ఉండేలా ఉంది. దీపికానే ఆ క్యారెక్టర్ ని బెస్ట్ ఛాయస్ అని సినిమా చూసినవారు అంటున్న మాట. ఇదిలా ఉంటే ఈ సినిమాకి పాజిటివ్ టాక్ వస్తోంది. కల్కి కూడా 1000 కోట్ల కలెక్షన్స్ అందుకోవడం గ్యారెంటీ అనే మాట వినిపిస్తోంది. అదే జరిగితే వెయ్యి కోట్లకి పైగా కలెక్షన్స్ సాధించిన మూడు సినిమాలలో భాగమైన హీరోయిన్ గా దీపికా ఖాతాలో అరుదైన రికార్డ్ చేరుతుంది. నటిగా ఆమె చాలా ఎత్తులో ఉంది. కల్కి తర్వాత కూడా ఆమె ఇండియన్ హాలీవుడ్ హీరోయిన్ గా గుర్తింపు పొందడం ఖాయం అనే మాట వినిపిస్తోంది. మొదటి రోజే కల్కి 200+ కోట్లకి పైగా కలెక్ట్ చేసి ఉంటుందని ట్రేడ్ పండితులు భావిస్తున్నారు. వీకెండ్ అయ్యేలోపు 500+ రీచ్ అవుతుందని అంచనా వేస్తున్నారు.



## నెట్ ఫ్లెక్స్‌లో భజే వాయు వేగం



ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ పై హీరో కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన "భజే వాయు వేగం" సినిమా గత నెల 31న థియేటర్స్ లో రిలీజై సూపర్ హిట్ అయ్యింది. ఇప్పుడు ఓటీటీ లోకి వచ్చేసింది. ఈ రోజు నుంచి నెట్ ఫ్లిక్స్ లో "భజే వాయు వేగం" సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. "భజే వాయు వేగం" సినిమాను నెట్ ఫ్లిక్స్ లో చూస్తున్న ఆడియెన్స్ మూవీలో తమకు నచ్చిన సన్నివేశాల స్క్రీన్ షాట్స్ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. "భజే వాయు వేగం" సినిమాలో ఐశ్వర్య మీనన్ హీరోయిన్ గా నటించింది. హ్యాపీ డేస్ ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్రను పోషించారు. ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు ప్రశాంత్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందించారు. అజయ్ కుమార్ రాజు.పి. కో ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు.



## "దీక్ష" షూటింగ్ పూర్తి

ఆర్.కె. ఫిలింస్, స్నిగ్ధ క్రియేషన్స్ బ్యానర్స్‌పై ప్రముఖ దర్శక, నిర్మాత, తెలంగాణ ఫిలిమ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'దీక్ష'. పినిశెట్టి అశోక్ కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మాతలు. కిరణ్‌కుమార్, అలేఖ్యరెడ్డి జంటగా నటిస్తున్నారు.ఇటీవల తెలంగాణ ఫిలింఛాంబర్ లో చిత్ర ప్రోగ్రెస్ ను తెలిపే కార్యక్రమంలో ఆర్ కే గౌడ్, హీరో కిరణ్, నటి తులసి,రైటర్ రామ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ మాట్లాడుతూ - నలభై సినిమాలకు దర్శకత్వం వహించిన రామకృష్ణ గౌడ్ గారు 'దీక్ష' మూవీతో మళ్లీ మెగాఫోన్ పట్టడం సంతోషంగా ఉంది. ఇప్పటి యంగ్ డైరెక్టర్స్ లా చాలా అప్డేటెడ్ గా, ప్లానింగ్ తో 'దీక్ష' మూవీ రూపొందిస్తున్నారు. గతంలో నేను తెలుగులో పది తమిళంలో రెండు సినిమాలు హీరోగా చేశాను ఈ సినిమాతో నాకు మంచి పేరుతో పాటు అవార్డ్స్ వస్తాయని ఆశిస్తున్నాను. మూవీ షూటింగ్ కంప్లీట్ అయ్యింది. రియలిస్టిక్ గా ఒక భారీ ఫైట్ సీక్వెన్స్ చేశాం. స్టంట్ మాస్టర్ రవికుమార్ చాలా బాగా ఆ ఫైట్ చేయించారు. ఒక నిమిషం పాటు ఉండే డైలాగ్ ఒకటి ఈ మూవీలో నాతో చెప్పించారు అన్నారు.


Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.